తిరుపతిలో కలపొద్దని అర్ధనగ్న ప్రదర్శన

కలువాయి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దని ఆదివారం కూడా ఆ ప్రాంత వాసులు ఆందోళనలు కొనసాగించారు. బస్టాండులో నిరసనకారులు అర్ధనగ్నంగా బైఠాయించారు. సేవ్ కలువాయి అంటూ నినాదాలు చేశారు. వారికి మద్దతుగా ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా, మంగళవారం నుంచి రిలే నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా మంత్రులు ఆనం, నారాయణలను కలసి తమ బాధ చెప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. కలెక్టర్‌ను కలసి జిల్లా మార్పుపై వినతి పత్రం అందజేయనున్నట్లు తెలియజేశారు.

విభజన మంటలు

- తిరుపతిలోకి వెళ్లనున్న కండలేరు జలాశయం
- రెండు జిల్లాల సాగునీటి రంగంపై తీవ్ర ప్రభావం
- పాలన తిరుపతిలో.. హక్కులు నెల్లూరులో..
- సోమశిల నీటి విడుదలలోనూ అభ్యంతరాలు
- భవిష్యత్‌లో వివాదాలు తలెత్తే ప్రమాదం
- 2022లోనే నివేదించిన అప్పటి కలెక్టర్




కలువాయి మండలాన్ని తిరుపతిలో కలపొద్దంటూ ఆదివారం అర్ధనగ్నంగా ఆందోళన చేస్తున్న ప్రజలు

జిల్లా విభజనతో ఇప్పటికే ఒకసారి తీవ్ర నిరాశకు గురైన జిల్లా ప్రజానీకం.. ప్రభుత్వ తాజానిర్ణయంతో మరోసారి కంగుతిన్నారు. నెల్లూరు జిల్లాలో కలపండి అంటూ కోరిన గూడూరు ప్రజలను విన్నపాన్ని పక్కన పెట్టడం ఒక ఎత్తయితే.. అసలు ఎవరూ కోరకపోయినా.... రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలోకి విలీనం చేయాలంటూ ప్రాథమికంగా నిర్ణయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో కండలేరు జలాశయం తిరుపతి జిల్లాలోకి వెళ్లనుందన్న వార్త రైతాంగాన్ని తీవ్ర కలవరపాటుకు గురిచేస్తోంది. భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులను తలచుకొని ఆందోళన చెందుతున్నారు.

నెల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం రాపూరు మండలంలో ఉన్నప్పటికీ దాని కింద లోయర్ రైపేరియన్ హక్కులు మనుబోలు, పొదలకూరు మండలాలకు ఉన్నాయి. ఈ రెండు మండలాలకు తాగు, సాగునీటి అవసరాలకు మొదట ప్రాధాన్యతను ఇచ్చి, మిగిలిన నీటిని తిరుపతి జిల్లాకు తీసుకెళ్లాల్సి ఉంది. ఈ మండలాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటి వరకూ కండలేరు నెల్లూరులోనే ఉండడంతో ఎప్పుడూ ఇబ్బందులు తలెత్తలేదు. ఆ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ మొత్తం జిల్లా అధికారుల చేతుల్లో ఉండేది కాబట్టి అవసరాన్ని బట్టి నీటి విడుదల చేసుకునే వీలు కలిగేది. అదే ఇప్పుడు తిరుపతి జిల్లా అధికారుల చేతుల్లోకి పాలన వెళ్లాక పరిస్థితులు ఎలా ఉంటాయోనని రైతాంగం భయపడుతోంది. అలానే కలువాయి మండల రైతాంగం ఆందోళన కూడా ఇదే మాదిరిగా ఉంది. సోమశిల దక్షిణ కాలువ కింద కలువాయి మండలంలో సాగు జరుగుతుంటుంది. ఇప్పుడు మండల పాలన తిరుపతిలోకి వెళ్లి, సాగునీటి పంపిణీ నెల్లూరు జిల్లాలో ఉంటే భవిష్యత్ ఇబ్బందులు ఎలా ఉంటాయోనని తలుచుకొని భయపడుతున్నారు.

పాఠం నేర్పిస్తున్న గత అనుభవాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశలోనే ఒకే జిల్లాలో 146 టీఎంసీలు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన జలాశయాలు లేవు. సోమశిలలో 78 టీఎంసీలు, కండలేరులో 68 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఈ నీటితో ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలే కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కూడా నీటిని అందిస్తూ వస్తున్నాయి. సోమశిల జలాశయానికి పెన్నా క్యాచ్‌మెంట్ ఉండగా, కండలేరుకు ప్రత్యేకంగా క్యాచ్‌మెంట్ లేదు. సోమశిల నీటి మీదనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం ఒకే జిల్లాలో ఉండడంతో రాజకీయ, అధికార, రైతాంగ వ్యవస్థల మధ్య ఎటువంటి ఇబ్బందులు లేకుండా కండలేరుకు నీటిని నింపుతూ వస్తున్నారు. అయితే కండలేరును వేరొక జిల్లాలోకి వీలీనం చేశాక, ఇప్పుడున్న మాదిరిగానే భవిష్యత్‌లో కూడా నీటిని విడుదల చేసేందుకు వీలు కలుగుతుందా..? అన్నదే చర్చనీయాంశంగా మారింది. సోమశిలలో 35 టీఎంసీలు దాటగానే ఇప్పుడు కండలేరుకు నీటిని విడుదల చేస్తున్నారు. దీనిపై డెల్టా రైతాంగం గానీ రాజకీయ నాయకులు గానీ అభ్యంతరాలు చెప్పడం లేదు. అదే పక్క జిల్లాలోకి వెళ్లాక భవిష్యత్‌లో ఈ పరిస్థితిని జిల్లా రైతాంగం, రాజకీయ వ్యవస్థలు ఒప్పుకుంటాయా..? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ముందు జిల్లా అవసరాలకు తగ్గట్టుగా సోమశిలో పూర్తిగా 78 టీఎంసీలు పెట్టాకనే కండలేరుకు విడుదల చేయండి.. అంటూ పట్టుబడితే కండలేరు మీద ఆధారపడ్డ ప్రాంతాల పరిస్థితేమిటన్న ఆందోళన మొదలైంది. గత అనుభవాలు దీనిని గుర్తు చేస్తున్నాయి. గతంలో కండలేరు జలాశయం నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు నీటిని తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని జిల్లా రైతాంగం, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. కండలేరు వద్ద ఆందోళనలు చేయడమేకాక చలో హైదరాబాద్ వంటి ఉద్యమాలు కూడా జరిగాయి. అప్పట్లో ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు జిల్లా హక్కుల కోసం ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనడం గమనార్హం. ఆ తర్వాత ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. ఇదే తరహా ఉద్యమాలు భవిష్యత్‌లో సోమశిల జలాల కోసం జరిగితే పరిస్థితేమిటన్న ప్రశ్నతలెత్తుతోంది.



కండలేరు జలాశయం

గతంలోనే నివేదించిన కలెక్టర్

2022లో జిల్లాల విభజన సమయంలో తొలుత వెంకటగిరి నియోజకవర్గం మొత్తాన్ని తిరుపతి జిల్లాలోకి కలిపేందుకు నిర్ణయించారు. ఈ నిర్ణయంపై అప్పట్లోనే కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. తమను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ డిమాండ్లు వెల్లువెత్తాయి. ఈ అంశంపై నాటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలు ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులను నివేదించారు. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల ప్రజల ఆకాంక్షలను తెలియజేస్తూనే, ఇరిగేషన్ పరంగా ఈ మూడు మండలాలకు నెల్లూరుతో ఉన్న సంబంధాలను నివేదించారు. కండలేరు జలాశయం అన్నది నెల్లూరు జిల్లాలో ఉంటేనే నెల్లూరు, తిరుపతి జిల్లాలకు మేలు జరుగుతుందని నాటి కలెక్టర్ ప్రభుత్వానికి స్పష్టంగా వివరించారు. ఈ నివేదికలతో ఏకీభవించిన అప్పటి వైసీపీ ప్రభుత్వం కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరులోనే కొనసాగించింది. అయితే ఇప్పుడు అనూహ్యంగా ప్రభుత్వం ఆ మూడు మండలాలను తిరుపతిలోకి వీలనం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది.

సోమశిలకు తగ్గిన వరద

అనంతసాగరం డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శనివారం 22,676 క్యూసెక్కులు వస్తుండగా ఆదివారానికి 16,852 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో 73.555 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 12,650, కండలేరుకు 2,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరులో 60.28 టీఎంసీల నీటి నిల్వ

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 60.28 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1750 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 1490 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.



వలేటివారిపాలెం మండలం పోకూరులో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

విజృంభిస్తున్న జ్వరాలు

- కందుకూరు ప్రాంతంలో ప్రబలిన డెంగ్యూ, స్క్రబ్‌టైఫస్
- మంచం పడుతున్న ప్రజలు
- అధ్వానంగా పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పట్టణంతోపాటు గ్రామాల్లోనూ విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.జ్వరం వస్తే వాంతులు, విరేచనాలు, ఎడతెగని తలనొప్పి, కీళ్లనొప్పులతో బాధితులు మంచం పడుతున్నారు. అంతేకాక డెంగ్యూ పాజిటివ్, స్క్రబ్‌టైఫస్ పాజిటివ్ కేసులు కూడా నమోదవుతున్నాయి. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. జ్వరం వస్తే రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చయిపోతోందని బాధితులు భయాందోళన చెందుతున్నారు.

ప్రతీ ఇంటిలో జ్వరపీడితులే...



కందుకూరులోని అనేక ప్రాంతాల్లో జ్వరపీడితులు అధికసంఖ్యలో ఉండగా, గ్రామాల్లోనూ ఇంటికి ఐదారు గురికి తక్కువ కాకుండా జ్వరాలతో మంచం పట్టారు. వలేటివారిపాలెం మండలం నేకునాంపురంలో ఇద్దరికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో వారు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరపీడితుల్లో అధికంగా డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదవుతు న్నాయి. అడపాదడపా స్క్రబ్‌టైఫస్ పాజిటివ్ కేసులు కూడా వస్తున్నాయని ఓ ప్రైవేటు వైద్యుడు తెలిపారు. ఇప్పుడిప్పుడే వర్షాలు తెరపిచ్చినందున డెంగ్యూ పాజిటివ్ కేసులు మరింత పెరిగే అవకాశం ఉంది. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో సీజనల్‌వ్యాధులు, జ్వరాలు ప్రబలుతుండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దోమలతో బెంబేలు

కందుకూరులోని శివారు ప్రాంతాలతోపాటు గ్రామాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి వర్షపునీరు నిల్వ ఉండటంతో అక్కడ డెంగ్యూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రైనేజీలు శుభ్రం చేయకపోతుండటంతో అవి దోమల వృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయి. అనేక గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు కూడా చేపట్టలేదు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లిన పాపానపోలేదు. వైద్యులు, వైద్యసిబ్బంది తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఆర్ఎంపీలు, ప్రైవేటు వైద్యులపై ఆధారపడి వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, దోమల నిర్మూలన కార్యక్రమాలు గ్రామగ్రామాన అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్క్రబ్ టైఫస్ అనుమానంతో మహిళ మృతి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత కాశీపాళెంకి చెందిన ఓ మహిళ అనుమానిత స్క్రబ్‌టైఫస్ వ్యాధితో మృతి చెందినట్లు ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. 32 ఏళ్ల వయసున్న మహిళకు జ్వరం రాగా, గత నెల 27న నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి స్క్రబ్‌టైఫస్(పాజిటివ్)గా నిర్ధారించి వైద్యసేవలందించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఈనెల 2న మృతి చెందినట్టు మృతురాలి సోదరుడు తెలిపారు. తన సోదరి అంత్యక్రియలు జరిగిన పక్కరోజున నెల్లూరు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ చేసి, ఆ మహిళకు ఎలా ఉందని అడిగారని, చనిపోయిందని చెప్పగా ఫోన్ కట్ చేశారని ఆయన తెలిపారు. ఈ విషయంపై బుచ్చి అర్బన్ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ కుమార్‌ను వివరణ కోరగా తమ పరిధిలో స్క్రబ్ టైఫస్ వ్యాధికి సంబంధించిన సమాచారమే లేదని, అయినా విచారిస్తామని చెప్పారు.

నేటి నుంచి పీజీ స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి సోమవారం(నేటి) నుంచి స్పాట్ అడ్మిషన్లను ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత ఉన్న విద్యార్థులు నేరుగా స్పాట్ అడ్మిషన్లలో పాల్గొని, సీటు పొందవచ్చన్నారు. ఈనెల 10 వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న ప్రధాన క్యాంపస్‌తోపాటు, కావలిలోని పీజీ సెంటర్‌లో కూడా ప్రత్యేక అడ్మిషన్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు తమ వెంట అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తప్పక తీసుకురావాలని తెలిపారు.

78 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఉలవపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం నెల్లూరు విజిలెన్స్ సీఐ నరసింహరావు పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారుల కథనం మేరకు వివరాలు... కనిగిరి నుంచి మహేంద్ర వాహనంలో ఉలవపాడు మీదుగా కావలి వైపు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అధికారులకు అందింది. దీంతో చాగొల్లు వద్ద కాపుకాచి వాహనాన్ని, డ్రైవర్ కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని ఉలవపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 78 బస్తాల్లో ఉన్న 3,900 కిలోల పీడీఎస్ రైస్ విలువ రూ. 1,87,200గా అంచనా వేశారు. కిషోర్ అనే వక్తి బియ్యం కొనుగోలుదారుడు కాగా, కనిగిరికి చెందిన హజరత్తయ్య మధ్యవర్తి అని అధికారులు తెలిపారు. స్థానిక వీఆర్‌వో సమక్షంలో 6ఏ కేసు నమోదు చేసి పట్టుబడిన బియ్యాన్ని కందుకూరు ఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించారు. ఖాళీ వాహనాన్ని తిరిగి ఉలవపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు విజిలెన్స్ పోలీసులు పేర్కొన్నారు.



అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

రౌడీషీటర్ల పరార్

- జైలు నుంచి బయటకు రాగానే అజ్ఞాతంలోకి..
- పోలీసుల ఎదుట హాజరు కాని వైనం
- కీలక వ్యక్తుల కోసం గాలింపు
- రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం
- యాక్టివ్ నేరగాళ్లపై రౌడీషీట్లు తెరవాలని ఆదేశం
- పదే పదే నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు



నెల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకూ కొందరి అండతో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన రౌడీషీటర్లు ప్రస్తుతం జిల్లా నుంచి పరార్ అవుతున్నారు. ప్రభుత్వం రౌడీయిజంపై దృష్టి పెట్టడం, పోలీసులు రౌడీలపై ఉక్కుపాదం మోపుతుండడంతో వారిలో భయం పట్టుకుంది. ప్రధాన రౌడీషీటర్లు ఒక్కొక్కరుగా పోలీసుల నీడ నుంచి తప్పించుకొని, ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. బెయిల్‌పై ఉన్న రౌడీషీటర్లు కూడా పోలీసుల ఎదుట హాజరుకాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. వీరికి కొందరు ఐడీ పార్టీ సిబ్బంది సహకరిస్తున్నార్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల వరకూ జిల్లాలో ప్రధాన రౌడీషీటర్లుగా చలామణి అవుతూ అనేక హత్య కేసుల్లో నిందితులుగా ఉన్న కొందరు రౌడీషీటర్లను వేదాయపాలెం పోలీసులు లేడీ డాన్ కేసులో అరెస్టు చేశారు. భారీగా గంజాయి విక్రయాలు చేస్తుండడంతో వీరిని పట్టుకున్నారు. వీరిలో ఇద్దరు రౌడీషీటర్లు ఇటీవల హైకోర్టు నుంచి కండిషనల్ బెయిల్ తెచ్చుకున్నారు. బెయిల్‌పై విడుదలై వెంటనే ఆ ఇద్దరు రౌడీషీటర్లు జిల్లా నుంచి పరారయ్యారు. తొలుత పోలీసుల నీడలోనే వీరు ఉన్నప్పటికీ.. వీరిపై ఉన్న ఇతర కేసులను కూడా పోలీసులు బయటకు తీస్తుండడంతో భయపడ్డారు. ఈ క్రమంలో కుటుంబాలతో సహా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. బెయిల్ కండీషన్స్ ప్రకారం వీరు పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉన్నప్పటికీ కొన్ని రోజులుగా హాజరుకావడం లేదు. దీంతో ఈ ఇద్దరు రౌడీషీటర్ల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ రౌడీషీటర్ల బెయిల్ రద్దుకు కోర్టులో పిటిషన్ వేసే అవకాశాలున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. అలానే మరికొంత మంది రౌడీషీటర్లు కూడా ప్రభుత్వ చర్యలతో కనిపించడం లేదు.

నేరగాళ్లపై ఉక్కుపాదం

ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు జిల్లా.. గడిచిన కొన్నేళ్లుగా హత్యలు, హత్యాయత్నాలు, బెదిరింపులు, దౌర్జన్యాలతో అట్టుడికిపోతోంది. ముఖ్యంగా గంజాయి బ్యాచ్‌లు శ్రుతిమించి వ్యవహరిస్తుండడం, అమాయకులను నడిరోడ్డుపై చంపేస్తుండడం ప్రజలను తీవ్ర కలవరానికి గురిచేసింది. అదే సమయంలో రౌడీలు, సస్పెక్ట్ షీట్లు, నేర ప్రవృత్తి కలిగిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. రౌడీలు, గంజాయి నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు దిశానిర్దేశం చేసింది. దీంతో పోలీసు యంత్రాంగం వేగంగా కదులుతోంది. రౌడీలు, నేరగాళ్ల కదలికలపై నిరంతర నిఘా పెట్టింది. వరుస పెట్టి రౌడీషీటర్లు, పాత నేరస్తులను అరెస్టు చేస్తోంది. అదుపుతప్పుతున్న శాంతిభద్రతలను దారిలోకి తెచ్చేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల వారీగా తరచూ నేరాలు, గొడవలకు పాల్పడుతున్న వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రౌడీషీట్లు ఉన్న వారి వివరాలను ఒక జాబితా, అలానే సస్పెక్ట్ షీట్లు, ఇటీవల ఎక్కువగా గొడవలు పడుతున్న వారి వివరాలతో మరో జాబితాను సిద్ధం చేస్తున్నారు. గత రెండేళ్లలో ఐదు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లపై పీడీ యాక్టును ప్రయోగించేందుకు నిర్ణయించారు. ఈ జాబితాలో సుమారు 30 మంది ఉన్నట్లు సమాచారం. ఆదివారం కూడా మరో రౌడీషీటర్‌పై పీడీ యాక్టు నమోదు చేయడం గమనార్హం. అలానే ఏడాదిలో మూడు కేసుల్లో ఉన్న నేరగాళ్లపై రౌడీషీట్లు తెరిచేందుకు సిద్ధమవుతూ వారిని కంట్రోల్ చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

మామిడి కాసేనా..!?

- అధిక వర్షాలతో ఊటెక్కిన మామిడి చెట్లు
- పూత స్థానంలో చిగురించిన లేటలు
- కాపు నిలవడంపై ఆశలు వదిలేసుకున్న రైతులు
- తోటలు కొనేందుకు వెనుకడుగేస్తున్న కౌలుదారులు

పూతలు మరింత ఆలస్యం

ఉలవపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గత అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలు మామిడికి శాపంగా మారాయి. ఇప్పటికి మామిడితోటల్లో వర్షపు నీరు నిలిచే ఉన్నాయి. భూమిలో తేమ శాతం అధికం కావడంతో మామిడి చెట్లు ఊటతేలాయని. పూతలు రావడం ఆలస్యం అవుతుందంటున్నారు. మామిడిలో సాధారణంగా ప్రతీ ఏడాది డిసెంబరు నుంచి జనవరి వరకు పూతలు వస్తూ ఉంటాయి. ఈ సీజన్‌లో పూచిన పూతలు మాత్రమే కాపును, దిగుబడిని నిర్ధారిస్తాయని రైతలు చెబుతుంటారు. డిసెంబరు వచ్చిందంటే మామిడి తోటల్లో కౌలు రైతులు క్షణం తీరక లేకుండా వేలకవేలు ఖరీదు చేసే మందులు పిచకారీ చేస్తు సేద్యం చేస్తుంటారు. అలాంటిది ఈ ఏడాది మామిడి తోటలు వెలవెలపోతున్నాయి.

పూతల స్థానంలో లేటలు(చిగుళ్లు)

వర్షాలు పడకుండా ఉంటే ఈపాటికి మామిడి చెట్లు పూత దిమ్మెకాడలతో దర్శనమిచ్చేవి. డిసెంబరు చివరికల్లా పూతకాడు పూతలతో మల్లె చెట్టును తలపించేలా ఉండేవి. అలాంటిది భూమిలో నీటి శాతం అధికం కావడంతో మామిడి చెట్లు పూతలు వేయాల్సిన స్థానంలో చిగురులు వేస్తున్నాయి. అక్కడక్కడ పది చెట్లలో ఒక చెట్టు మాత్రమే పూతలకు సిద్ధంగా ఉంది. అన్నీ ఒక్కసారి పూతలకు వస్తేనే రైతు దుక్కి, మందుల సేద్యం చేసేందుకు సిద్ధపడతాడు. ఇప్పుడు లేటలు వేసినందున వాటి నుంచి పూతలు రావడానికి సుమారు మూడు నెలలు పడుతుదని రైతులు చెప్తున్నారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మార్చి నెల వరకు పూతలు వస్తూనే ఉంటాయని చెప్తున్నారు. ఆ సమయంలో వేసిన పూతలు నిలబడే అవకాశాలు తక్కువగా ఉంటాయని పిందెలు, కాయలు నిలబడవని, దీంతో రైతుకు నష్టం తప్పదని లెక్కలు వేస్తున్నారు.



మామిడి తోటలో చెట్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

ముందుకు రాని కౌలు రైతులు..

మండలంలో సుమారు 4000 ఎకరాల్లో మామిడి సాగులో ఉంటే అందులో 80 శాతం కౌలు రైతులు స్వాధీనంలో ఉంటాయి. ఈపాటికి రూ.లక్షలు పెట్టి పోటీపోటీగా మామిడి తోటలు కౌలుకు తీసుకునే రైతులు ఆలోచనలో పడ్డారు. పూతలు ఆలస్యం కావడం, వచ్చిన పూతలు నిలుస్తాయో లేదో అని సందిగ్ధం వీటన్నిటిని బేరీజు వేసుకొని కౌలు రైతులు వెనకడుగు వేస్తున్నారు. మొత్తానికి ఈ ఏడాది మామిడి వ్యాపారానికి గడ్డుకాలమనే చెప్పొచ్చు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100) : 670

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.12,288
వెండి కిలో ధర రూ. 1,83,600
వెండి ఒక గ్రాము రూ.188.60

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సౌత్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కే.వెంకటరెడ్డి సూచించారు. ఆదివారం పొట్టేపాలెం నుంచి నగరంలోకి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌లు, ట్రక్కుల డ్రైవర్‌లకు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి వాహనాలకు రేడియం స్టిక్కర్లును అంటించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మితిమీరిన వేగం అనేక ప్రమాదాలకు దారి తీస్తుందని సూచించారు. ఇసుక ట్రాక్టరు డ్రైవర్లు తప్పనిసరిగా పట్టలు కప్పాలని, డ్రైవర్లు అందరూ విధిగా లైసెన్సు, వాహనపత్రాలన్నీ ఫోర్సులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఐ చంద్రమౌళి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నీ క్షేత్రాల్లో 'పూరీ' గొప్పది


ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్ని క్షేత్రాల్లో పూరీ క్షేత్రం గొప్పదని చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. శంకరాచార్య కృప జగన్నాథ అష్టకంపై తమ ప్రవచన ధారను రెండో రోజు ఆదివారం ఆయన కొనసాగించారు. ముందుగా ఆయనను భరద్వాజ రుద్రాభిషేక సంఘ సభ్యులు ఫణిరత్నం, కోట వంశీకృష్ణ, నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు, సుబ్రహ్మణ్యంలు పుష్పమాలలతో సత్కరించారు. అనంతరం ప్రవచనం ప్రారంభించి మొదటి శ్లోకంలో కాళింది అను పదమునకు కాలాతీతము అని అర్థమని, జగన్నాథస్వామి లక్ష్మీదేవి, పరమశివుడు, బ్రహ్మదేవుడు, ఇంద్రుడు, మహాగణపతిచే పూజలు అందుకుంటారని, అదేవిధంగా పూరీ క్షేత్ర విశిష్టతను తెలియజేశారు.

కదిలే రైలు ఎక్కుతూ మహిళ మృతి


సోన మృతదేహం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కదిలే రైలు ఎక్కుతూ ఓ మహిళ ప్రమాదవశాత్తు జారిపడి ప్లాట్‌ఫారమ్‌కు, రైలుకు మధ్యలో ఇరుక్కొని మృతి చెందిన ఘటన ఆదివారం నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. నాగస్ ప్రాంతానికి చెందిన బీ సోన కుటుంబసభ్యులు తాంబరంలో తెలిసిన వారి దుకాణంలో పని చేసేందుకు నాగస్ ఎక్స్‌ప్రెస్‌లో రిజ్వర్వేషన్ చేసుకొని బయలుదేరారు. రైలు ఆదివారం నెల్లూరు ప్రధాన స్టేషన్ మూడవ నెంబరు ప్లాట్‌ఫారమ్‌లో నిలవడంతో వాటర్ బాటిల్, స్నాక్స్ కోసం సోన రైలు దిగి దుకాణం వద్దకు వెళ్లింది. గ్రీన్‌సిగ్నల్ పడటంతో రైలు ముందుకు కదలడాన్ని గమనించిన ఆమె పరు గులు తీస్తూ రైలును ఎక్కే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ప్రమాదవ శాత్తు కాలు జారీ రైలు కిందకు జారిపోయింది. ప్లాట్‌ఫారమ్, రైలుకు మధ్య ఇరుక్కుపోయి తలకు తీవ్రగాయమై మృతి చెందింది. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ ఎస్ హరిచందన మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాధాకృష్ణగౌడ్


రాధాకృష్ణగౌడ్

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ముక్కు రాధాకృష్ణగౌడ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన బీజేపీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

కళాకారులకు బీమా భద్రత కల్పించండి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాట్య కళాకారులకు జీవిత బీమా భద్రత కల్పించాలని జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆదివారం ఎంపీ వేమిరెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. జిల్లాలోని డ్యాన్స్ కళాకారులు దాదాపు 700 కుటుంబాలు ఉన్నాయని, అందులో 350 పై చిలుకు కుటుంబాలు డాన్సుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఏదైనా ప్రమాదాలలో చనిపోయినా కుటుంబాలకు వీపీఆర్ ట్రస్ట్ ద్వారా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నటరాజ్, ఉపాధ్యక్షుడు సాయి, ట్రెజరర్ బీ. చంద్ర, కే.రమణయ్య, కరిముల్లా, యాంకర్ రూప, మహేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణ ● పార్లుకట్టకు ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు(సిటీ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిచాలని రాష్ట్ర పురపాలక మంత్రి పీ.నారాయణ పేర్కొన్నారు. నగరంలోని 48వ డివిజన్ ప్రాంతంలో పొర్లుకట్టకు ప్రహరీ గోడ నిర్మించేందుకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డివిజన్‌లో పర్యటించినప్పుడు ప్రజలు ఈ పనులు అవసరమని తన దృష్టికి తీసుకువచ్చారని, స్థానికుల అభ్యర్థన మేరకు పొర్లుకట్టకు ప్రహరీ గోడ, డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. వీటిని నిర్దీత కాల వ్యవధిలో లోపే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకులు అనురాధ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి నారాయణ

ఆర్చరీ క్రీడాకారులకు అభినందన

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మహేశ్వరి, పరమేశ్వరి కళ్యాణ మండపంలో జాతీయ, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులకు ఆదివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష మాట్లాడు తూ ఇటీవల వరుసగా జరిగిన సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ఏడుగురు క్రీడాకారులు పదిహేను పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన జీ.వెంకటలోకేష్, జీ.మహీధర్, వై.దీత్యాచంద్రిక, పీ.రాజేష్, తరుణీష్‌జాత్యా, కే.తన్విసాయిఅశ్విని, ఆర్.సాయి మౌర్యలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్‌డీవో నసీమ్, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఆనం మహేష్‌రెడ్డి, జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యద ర్శి పావురాల వేణు, జేడీ.సుందరరావు, ఎస్‌కే.జిలానీబాషా, బీవీఎస్. నరసింహారావు, వీ.శ్రీనివాసులు, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో మహిళల సమస్యలు పరిష్కరించాలి

● శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి


ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే మహిళల సమస్యలు పరిష్కా రానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీఎస్ఆర్టీసీ శ్రామి క మహిళా రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వరి అన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన రాష్ట్ర సదస్సులో ఆమె మాట్లాడారు. వేతన కమిటీని వేయడంతో పాటు 30శాతం ఇంటీరియర్ రిలీఫ్‌ను ప్రకటించాలన్నారు. స్త్రీశక్తి పథకం విషయంలో ప్రభుత్వం ఆర్టీసీ సంఘాలతో, మహిళలతో చర్చించి చట్ట ప్రమా ణాలను పాటించాలన్నారు. మహిళలకు ద్వారా స్మార్ట్‌కార్డులు ఇప్పించాలని, రద్దీలో స్వల్ప పొరపాట్లకు కండక్టర్లను బాధ్యులను చేసే విధానం నిలిపివేయాలన్నారు. అనంతరం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రాజేశ్వరి, కోకన్వీనర్‌గా సీతాలక్ష్మితో పాటు మరో 11 మంది సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎస్ గౌరవాధ్యక్షుడు జిలానీబాషా, అధ్యక్షుడు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారావు, నాగేంద్రరావు, శివకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షబ్బీర్, రమణయ్య పాల్గొన్నారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌టీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లో జరుగుతున్న పేకాట కేంద్రంపై బాలాజీనగర్ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్‌టీఆర్‌నగర్‌లోని ఓ ఇంట్లో పేకాట జరుగుతోందని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కే.సాంబశివరావుకు సమాచారం అందడంతో ఆయన తన సిబ్బందితో కలిసి పేకాట కేంద్రంపై దాడి చేశారు. పేకాటాడుతున్న కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంకు చెందిన జీ.ఆదిశేషయ్య, ఎం.అన్వర్, నెల్లూరు చంద్రమౌళినగర్‌కు చెందిన ఈ నాగరాజులతో పాటు ఓ మహిళ జూదరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.22,500, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మైనార్టీలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టి డిమాండ్ చేశారు. ఆదివారం అవాజ్ జిల్లా మహాసభ నగరంలోని వెంకటేశ్వరపురంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ మైనార్టీలలో ఉన్న అన్ని వర్గాలు కలిసి లౌకిక భావాలతో నడుస్తున్న అవాజ్‌కు అండగా నిలవాలన్నారు. ముందుగా వెంకటేశ్వరపురంలో ప్రదర్శన నిర్వహించి డాక్టర్ జాకీర్ హుస్సేన్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా 27 మందితో అవాజ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సయ్యద్ రఫీ, షేక్ రషీద్, కోశాధికారిగా మహ్మద్ సర్దార్ అహ్మద్ ఎన్నికయ్యారు.

చెస్‌లో దేశప్రతిష్టను ఇనుమడింప చేయాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి దేశ ప్రతిష్టను, రాష్ట్ర, జిల్లా కీర్తిని ఇనుమడింపచేయాలని రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సుమన్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఎస్‌వీ చెస్ అకాడమీలో అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించిన జిల్లా క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారులపై గెలుపొంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య ప్రకటించిన రేటింగ్ జాబితాలో జిల్లాకు చెందిన ఆర్.నేహ, ఎం.సుదీక్ష, వీ.క్షవిక్‌లు చోటు సాధించడం గర్వకారణమన్నారు. అకాడమీ కోచ్‌లు ఎస్.వంశీకృష్ణ, సుదాత్రీ, తల్లిదండ్రులు, క్రీడాకారు లు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో 22 పార్కుల్లో సోలార్ వెలుగులు

నెల్లూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : సీఎస్‌ఆర్ నిధులను ఉపయోగించి 22 పార్కుల్లో రూ.80 లక్షలతో సోలార్ విద్యుత్ వెలుగులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని 27వ డివిజన్ రిత్విక్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలో సోలార్ స్తంభాల ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26వ డివిజన్లలో 18 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాలను కాపాడామన్నారు. దీని విలువ మార్కెట్ ధరల్లో సుమారుగా రూ.400 కోట్లు ఉంటుందని తెలిపారు. తొలి విడతలో భాగంగా రూ.7 కోట్లతో రక్షణ గోడలు నిర్మించామని చెప్పారు. కబ్జాదారులు అటువైపు కన్నెత్తైన చూడకుండా తగు జాగ్రత్తలు తీసుకుని స్థానిక ప్రజలకు అప్పగించినట్లు పేర్కొన్నారు. వాటిల్లో 22 పార్కుల్లో సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ఏకంగా రూ.80 లక్షలు ఖర్చు చేసి సోలార్ వెలుగులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వీలైనంత వరకు నిధులను రాబట్టి ప్రజల అవసరాల కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. వీటితో పాటు 26వ డివిజన్‌లో రూ.35 లక్షలతో 2370 మొక్కలు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ గ్రామదేవతలను ఆరాధించాలి


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో రామానంద తీర్థ భారతిస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గ్రామ దేవతలను ఆరాధించాలని రామానంద తీర్థ భారతి స్వామి సూచించారు. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలి కారు. అమ్మవారి మూలవర్లుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ ఇరుకళల పరమేశ్వరి మహత్యాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి సుజితమ్మ, చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషితోనే విద్యాసంస్థల అభివృద్ధి

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి నారాయణ విద్యాసంస్థల అభివృద్ధికి పాటుపడ్డారని జీఎం వీ.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రామలింగాపురం నారాయణ పాఠశాలలో జరిగిన ఉద్యోగుల సమ్మేళన కార్యక్రమానికి ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిరు ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించిన తాను నేడు జీఎం స్థాయికి ఎదిగానని, కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం సిబ్బందికి క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఏజీఎంలు, డీన్‌లు, డీజీఎంలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వేదాయపాలెంలో అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పడిపూజ వైభవంగా జరిగింది. తొలుత అయ్యప్పస్వామికి నిర్మాల్య దర్శనం పాలాభిషేకం, మహాగణపతి హోమం, దేవాలయ ప్రాంగణమంతా వివిధ సుగంధ పుష్పాలంకరణ, స్వామివారికి ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, మహాపుష్పాభిషేకం, సాయంత్రం పూలంగిసేవ, దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూరదీపం, హరిహరాసనం సేవ జరిగాయి. అనంతరం కేరళ సాంప్రదాయ మంగళవాయిద్యాలతో స్వామియే శరణం అయ్యప్ప శరణుఘోషలతో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. భగవతిసేవలు వైభవంగా నిర్వహించారు.

జగన్ క్షమాపణ చెప్పాలి

విడవలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కులానికి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, ఐపీఎస్ అధికారి గోపీనాథ్‌లపై అవమానకర వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డికి బీసీలు ఉన్నత స్థానంలో ఉండటం నచ్చడం లేదన్నారు. పరకామణి కేసులో సాక్షాత్తు సుప్రీంకోర్టు ఒక సిట్ ఏర్పాటు చేసి, అందులో అధికారులను నియమిస్తే వారికి టీడీపీ ముద్రవేసి కించపరిచేలా జగన్‌రెడ్డి మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలపై ఎన్ని రకాల కేసులు పెట్టి వేధించిందో ప్రజలకు తెలుసునన్నారు. టీడీపీ బీసీలకు పెద్దపీట వేయడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నాడని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన డ్రైవర్లు

మనుబోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాతీయరహదారిపై గురివిందపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆగి ఉన్న లారీపైకి కారు దూసుకెళ్లింది. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు మేరకు.. నెల్లూరు నుంచి చెన్నైకు వెళుతూ గురివిందపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో రోడ్డు మార్జిన్‌పక్కన లారీ నిలిపారు. ఇద్దరు డ్రైవర్లు బహిర్భూమికి వెళ్లొచ్చి, తిరిగి బయలుదేరుతూ టైర్లలో గాలి తనిఖీ చేస్తుండగా నెల్లూరు నుంచి మదనపల్లి వెళుతున్న కారు వేగాన్ని అదుపుచేయలేక రోడ్డు పక్కన ఆగిఉన్న లారీపైకి దూసుకువచ్చింది. ఈ క్రమంలో డ్రైవర్లు చెన్నై పెరంబూరుకు చెందిన రాజ్‌కుమార్, పరమశివం తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108లో హైవే పోలీసులు నెల్లూరుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కసుమూరులో పోలీసుల కార్డన్ సెర్చ్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు

వెంకటాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూ రులో ఆదివారం వేకువ జామున నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ తని ఖీల్లో భాగంగా అద్దె గృహాలు, ఇళ్లను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలులేని 39 మోటార్ బైక్‌లు, ఏడు ఆటోలను సీజ్ చేశారు. అలాగే అద్దె గృహాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న రెండు జంటలను అదుపులోకి తీసుకుని ఆ గృహాల నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వెంకటాచలం సీఐ సుబ్బా రావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు కసుమూరులో కార్డన్ సెర్చ్ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కసుమూరు తిప్పపై కూడా డ్రోన్ సహాయంతో నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై నిఘా పెట్టామని, ప్రతీ వారం కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు పేర్కొ న్నారు. అనంతరం హెల్మెట్, ట్రాఫిక్ రూల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఆంజనేయులు, రూరల్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ గుంతను పూడ్చండి మహాప్రభో...


సౌత్‌ఆములూరు వద్ద గుంతలు పడ్డ ఆర్‌అండ్‌బీ రహదారి

తోటపల్లిగూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెల్లూరు నుంచి కోడూరుకి వెళ్లు సౌత్‌ఆములూరు పంచాయతీ బ్రహ్మంగారి మఠం వద్ద రోడ్డుకు గుంత ఏర్పడి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ రహదారి గుండా విలుకాని పల్లి, పొట్లపూడి, కొత్తపాలెం, కోడూరు, కోడూరు బీచ్‌కు నిత్యం వేలాది వాహనాలు రద్దీగా ఉంటుంది. ఆ గుంతకు ఎటువంటి సూచిక బోర్డులు ఆర్‌అండ్‌బీ అధికారులు పెట్టక పోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ కుటుంబం పిల్లలను బైక్‌లో ఎక్కించుకుని వెళుతుండగా ఆ గుంత కనబడక పోవడంతో ప్రమాదం సంభవించింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆ గుంతకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి గుంతను మరమ్మతులు చేసి ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రమాదాలు మరిన్ని సంభవిస్తాయని వారు ఆందోళన చెందుతున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యులు, గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాలలు సమర్పించారు. ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలను వివరించారు.

ఏపీటీఎఫ్ మండల శాఖ కమిటీ ఎంపిక

తోటపల్లిగూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) తోటపల్లిగూడూరు మండల శాఖ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కమిటీలో మండల గౌరవాధ్యక్షుడిగా ఈగ రమయ్య, అధ్యక్షుడిగా సీహెచ్ దేవప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా షేక్ అహ్మద్‌బాషా, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎ. శైలజ, షేక్ లెనిన్ బాబు, ఎస్‌డి. ఖాజామస్తాన్, కార్యదర్శులుగా ఎంఆర్.నరేంద్ర, పీవీ నాగరాజు, డీ వెంకటరావు, ఓ.స్నేహలత, జి.శ్రీనివాసులు, టి. సునీత, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్. రామ్మోహన్‌రావు, జీవి. రమణప్రసాద్, వి. జయ కుమారి, ఎ. లలితా రాజ్యలక్ష్మీ, ఎస్‌వి. సత్యసేవ, ఎ. వెంకటసుబ్బయ్య, ఎ.శ్రీనివాసులు, ఎం.మురళీ, ఎన్. ప్రశాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఓ. శ్రీనివాసరాజు, ఎన్నికల పరిశీలకులుగా ఎన్. జనార్దన్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్, పి. బాలచంద్రుడు, సుధాకర్, షేక్ సర్దార్ పాల్గొన్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గొలగమూడిలో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి గ్రామంలో ఆదివారం జీవీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూ నిట్ ఆధ్వర్యంలో జయభారత్ హాస్పిటల్ సహకా రంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ ఎస్‌ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ మద్దినేని సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 40 మందికి పైగా జనరల్ మెడిసిన్, కంటి వైద్య పరీక్ష లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయభారత్ హా స్పిటల్ డిప్యూటీ మేనేజర్ కృష్ణారెడ్డి, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ దోర్నాదులు వెంకటేశ్వర్లు, ఆంగ్ల ఉపాధ్యాయుడు రాధాకృష్ణ, ఎన్‌ఎస్ ఎస్ వాలంటీర్లు, పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హెల్మెట్ దాతా.. రక్షోభవ!

● 172 మందికి పంపిణీ ● దాతను అభినందించిన పోలీసులు


హెల్మెట్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మనుబోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించి నడిపి, ప్రమాదాలనుంచి ప్రాణాలు కాపాడుకోవాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అన్నారు. మనుబోలు టీడీపీ యువ నాయకుడు మోపూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో 172 మందికి హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ, సీఐ శివరామ కృష్ణారెడ్డి హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఇంతమందికి హెల్మెట్‌లు ఉచితంగా ఎవరూ అందించలేదన్నారు. హెల్మెట్ దాతకు పోలీసుశాఖ తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి మోటార్‌సైకిల్ ఎక్కాలన్నారు. పోలీసుల కోసం కాకుండా, మీకోసం, మీ ప్రాణాలు కాపాడుకునే నిమిత్తం హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. గతేడాదిలో మండలంలో హెల్మెట్‌లు లేకనే 42 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారన్నారు. అనంతరం 172 మందితో మనుబోలు పోలీస్‌స్టేషన్ నుంచి హైవే మీదుగా మనుబోలు వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. దాతను పోలీసులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివరాకేష్, టీడీపీ నాయకులు చేరెడ్డి పద్మనాభరెడ్డి, ముంగర విజయభాస్కర్ రెడ్డి, సాని వెంకట రమణయ్య, శివుడు రాజాగౌడ్, దండు చంద్రశేఖర్‌రెడ్డి, చెల్లగిరి చిట్టిబాబు పాల్గొన్నారు.

పొదలకూరు వరద కాలువను బాగు చేయండి


కాలువ దుస్థితిని వివరిస్తున్న నాయకులు

పొదలకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు వరద కాలువను బాగు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి చింతగింజల సుబ్రహ్మణ్యం, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు మాముడూరు రవీంద్రబాబు డిమాండ్ చేశారు. ఆదివారం రమణారెడ్డి కాలనీ, శ్రీనివాస లేఅవుట్ లోని వరద కాలువను వారు పరిశీలించారు. వేంక టేశ్వర స్వామి దేవాలయం వద్ద టైలర్స్ కాలనీలో మసీదుల వద్ద ఈ కాలువ అధ్వానంగా తయారైందన్నారు. పూడిక తీయకపోవడంతో కాలువలో నీరు ముందుకు కదలడం లేదన్నారు. అధికారులు చొరవ చూపి కాలువ పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలం బీజేపీ ఉపాధ్యక్షులు చొప్పా వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షులు గురుస్వామి పాల్గొన్నారు.

మెన్స్ ఛాంపియన్ వర్సిటీ కాలేజ్... ఉమెన్స్ ఛాంపియన్ జేబీ టీం


అపర్ణ


వికాస్

● ముగిసిన వీఎస్‌యూ అథ్లెటిక్స్ పోటీలు

కావలి (టౌన్) డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో పురుషులు, మహిళల విభాగాల్లో జరిగిన పోటీలకు యూనివర్శిటీ అబ్జర్వర్లుగా ప్రవీణ్, అమ్మాజీ వ్యవహరించారు. కావలి జేబీ కళాశాలకు చెందిన డి వికాస్ 15 పాయింట్లతో వీఎస్‌యు మెన్ ఛాంపియన్‌గాను, జేబీకే చెందిన వాయల అపర్ణ 23 పాయింట్లతో వీఎస్‌యు ఛాంపియన్‌గా నిలిచారు. నెల్లూరు వీఎస్‌యు కళాశాల 74 పాయింట్లతో మెన్ వోవరాల్ ఛాంపియన్లుగా, కావలి జేబీ కళాశాల 43 పాయింట్లతో ఉమెన్ వోవరాల్ ఛాంపియన్లుగా నిలిచారు. హాకీ, రెజ్లింగ్ పోటీల్లో వీఎస్‌యు జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు విజేతలను అభినందించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం



నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా నెల్లూరు 6, కావలి 5, ఆత్మకూరు 4, కందుకూరు 3 కేంద్రాలతో కలిపి 18 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 3,683 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 3,553 మంది హాజరై 130 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలను డీఈవో బాలాజీరావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఆసుపత్రిలో అనకొండ



ఉదయగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆదివారం భారీ కొండచిలువ ప్రత్యక్షమవడంతో ఉద్యోగులు భయభ్రాంతులకు గురయ్యారు. జీఎంకే ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి సూచన మేరకు ట్రస్టు ప్రతినిధులు వైద్యశాల ఆవరణను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయిస్తున్నారు. ఈక్రమంలో కొండచిలువ కనిపించింది. స్థానికులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నారు. అనంతరం కొండచిలువ సమీపంలో ఉన్న చెట్లపొదల్లోకి వెళ్లడంతో ఉద్యోగులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

జగన్‌కు భవిష్యత్‌పై భయం

● ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సమర్థవంతమైన పనితీరుతో జగన్మోహన్‌రెడ్డికి ఆయన భవిష్యత్తుపై భయం పట్టుకుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎద్దేవా చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రంగాల్లో పెట్టుబడులు తీసుకువచ్చి నిరుద్యోగులకు భరోసా ఇచ్చేందుకు మంత్రి లోకేష్ ఎంతో ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై అనుమానాలు రేకెత్తించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతుందన్నారు. 18 నెలల కూటమి ప్రభుత్వంలో లోకేష్ కోట్లాది రూపాయలు విమాన ప్రయాణాల పేరిట దుర్వినియోగం చేశారని జగన్ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చాయ్, ఎగ్‌పఫ్‌ల పేరిట వందల కోట్ల రూపాయలు దోచుకున్న జగన్‌కు లోకేష్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. విమాన చార్జీలకు లోకేష్ ఒక్క రూపాయి కూడా ఖజానా నుంచి ఖర్చు చేయలేదన్నారు. పరిటాల రవి, వైఎస్ వివేకానందరెడ్డి హత్యల విషయంలో నిందితులు అనుమానాస్పదంగా చనిపోతున్నారని, సాక్షులు మాయమైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరకామణి కేసులో సీఐ సతీష్‌కుమార్ అనుమానాస్పదంగా చనిపోయారని పేర్కొన్నారు. ఈ కేసులో రవికుమార్ దేవుడు సొమ్ము వందల కోట్లు దోచుకుంటే దర్యాప్తు చేయకుండా అడ్డుకుంది జగన్మోహన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అరాచకాలు, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, వీటిపై దర్యాప్తు పూర్తయ్యేలోగా వైసీపీ కనుమరుగవుతుందని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, ఐఏఎస్ అధికారి గోపినాథ్‌జెట్టీలను జగన్ అగౌరవంగా మాట్లాడటం తగదని రవిచంద్ర అన్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చి ఉన్నతస్థాయికి ఎదిగిన వారిని వాడు.. వీడు అంటూ సంస్కారహీనంగా సంబోధించటం సరికాదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు పీఎల్ రావు, కప్పిర శ్రీనివాసులు, అమ్ములు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మీ-సేవ కేంద్రాలను పునఃప్రారంభించాలి

● అమరావతిలో 16 నుంచి రిలే నిరాహార దీక్ష


రిలే నిరాహార దీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మీ-సేవ కేంద్రాలను పునఃప్రారంభించాలని మీ-సేవ కాంట్రాక్టు యూనియన్ డిమాండ్ చేసింది. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్, మీ-సేవ జిల్లా అసోసియేషన్ నేతలు సునీల్, భువనేశ్వరి, మల్లికార్జున విలేకర్లతో మాట్లాడారు. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మీ-సేవ కేంద్రాలను తీసుకువచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 607 మంది ఉద్యోగులు ఇందులో పనిచేస్తున్నారని చెప్పారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి నోటీసులు లేకుండా మీ-సేవ కేంద్రాలను ఎత్తి వేసిందన్నారు. 2024 ఎన్నికల్లో నారా లోకేష్ మీ-సేవ కేంద్రాలను పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారం చేపట్టి 18 నెలలు దాటినా నేటికీ ఆ కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 16 నుంచి నాలుగు రోజులపాటు అమరావతిలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం రిలే నిరాహార దీక్ష పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

బాణసంచా పేలి బాలుడికి తీవ్ర గాయాలు

చేజర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామదేవత ఆదూరమ్మ ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు బాణాసంచా పేలి ఏడు సంవత్సరాల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు... ఆదివారం ఆలయం వద్ద బాణాసంచా వేడుకల నడుమ గ్రామస్థులు పొంగళ్ల కార్యక్రమాన్ని పూర్తిచేశారు. అనంతరం ఒక బాలుడు బాణాసంచాకు సంబంధించిన కర్రలు పోగుచేసి తమ కుటుంబం వాడుకునే కట్టెల పొయ్యిలో వేశాడు. అయితే అందులో పేలకుండా ఉన్న బాణసంచా పేలడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 ద్వారా నెల్లూరుకు తరలించారు.

ప్రైవేటు అటెండెన్స్ ఉందా..?

● రిజిస్ట్రేషన్‌శాఖలో రద్దు చేస్తున్నట్లు ఆదేశాల్లేవు
● రద్దు అయినట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు
● మభ్యపెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం
● ప్రజలకు ఇబ్బందులు

అల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆదాయ వనరుగా రిజిస్ట్రేషన్‌శాఖ ఉంది. గత వైసీపీ పాలనలో ఈ వ్యవస్థలో కీలక మార్పులు చేశారు. ఈ మార్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందులో ఓటీపీ సమస్య ఒకటైతే, ప్రైవేటు అటెండన్స్ రిజిస్ట్రేషన్ విధానం మరొకటి.

● ప్రైవేటు అటెండెన్స్ అంటే...

సాధారణంగా అనారోగ్యంతో ఉన్నవారు, కదలలేని స్థితిలో ఉన్నవారు, వృద్ధులు తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు, ఇతరులకు చేసేందుకు కార్యాలయాలకు రాలేరు. వారి కోసం వారి ఇంటి వద్దకే సంబంధిత సబ్ రిజిస్ట్రారు హాజరై సదరు వ్యక్తి వివరాలు, ఆస్తి వివరాలు పరిశీలించి, విచారించి రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేస్తారు. ఇందుకు ఆ వ్యక్తి స్టాంపు డ్యూటీ, ఫీజు, యూజర్ చార్జీలతోపాటు అదనంగా రూ.వెయ్యి చలానా చెల్లించి, వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని కూడా దస్తావేజుతోపాటు దరఖాస్తు చేయాల్సి ఉంది. తద్వారా కార్యాలయంలో ముందుగా చేయాల్సిన ప్రక్రియను పూర్తిచేసిన తరువాతే సంబంధిత అధికారి ఆ వ్యక్తి ఇంటికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయడాన్నే ప్రైవేట్ అటెండెన్స్ అంటారు. బ్రిటీష్ హయాంలో ప్రవేశపెట్టిన ఈ విధానం 2024 వరకూ కొనసాగింది.

● అధికారుల తిలోదకాలు

గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 విధానంతో రిజిస్ట్రేషన్‌శాఖలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఇందులో భాగంగా ప్రైవేటు అటెండెన్స్‌ను తొలగించారని ప్రచారం చేశారు. 2.0కు ముందు ఈ విధానం సాగుతుండేది. 2.0 విధానం అమల్లోకి వచ్చాక ప్రైవేటు అటెండెన్స్ విధానాన్ని అధికారులు పూర్తిగా విస్మరించారు. అసలు ఏ విధంగా చేస్తే ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయా ? అనే అంశాన్ని పూర్తిగా వీడనాడి ఈ విధానమే రద్దయిందంటూ కొంతమంది అధికారులు చెబుతున్నారు. 2.0 విధానం అమలులోకి వచ్చాక ప్రైవేటు అటెండెన్స్ విధానాన్ని తొలగిస్తున్నట్టు ప్రభుత్వం నుంచి కానీ, సంబంధిత శాఖ నుంచి ఎటువంటి ప్రకటనలు, ఉత్తర్వులు జారీ కాలేదు.


అల్లూరులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కొనసాగించాలి



రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేటు అటెండెన్స్ విధానాన్ని కొనసాగించాలి. కదల్లేని స్థితిలో ఉన్నవారి ఆస్తి లావాదేవీలకు ఉపయోగపడే ఈ విధానాన్ని ఎందుకు మరుగున పెడుతున్నారో అర్థం కావడం లేదు. దీన్ని అమలు చేయకపోతే పలు సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- గుడిపాటి ప్రసాద్ ఆచారి, అల్లూరు

ఎందుకు పట్టించుకోరు..



ప్రైవేటు అటెండెన్స్ విధానాన్ని నిలువరిస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. కొన్నిదఫాలు ఆస్తులు దుర్వినియోగమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఈ విషయాన్ని అధికారులు గమనించి దీన్ని యథాతథంగా అమలు చేయాలి.
- యరటపల్లి శేఖర్ రెడ్డి, అల్లూరు

జరిలమని కుదరదంటే ఎలా..?



ప్రైవేటు అటెండెన్స్ విధానంలో రిజిస్ట్రేషన్ జరిలమని, రద్దు చేసే విధంగా ప్రచారం చేస్తే ఎలా..? ఏ కార్యాలయానికి వెళ్లినా ఈ ప్రక్రియ వినియోగంలో లేదనే జవాబు వస్తోంది. దీన్ని అమలు చేయాల్సిందే.
- కప్పిరి విష్ణుయాదవ్, బీరంగుంట


నూతన కార్యవర్గానికి ఎంపికైనవారు

ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఎస్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఎస్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో సభ్యుల ఆమోదంతో కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడుగా జీ.రాజమనోహర్, అధ్యక్షుడుగా ఎం సుదర్శనం, ప్రధానకార్యదర్శిగా కే.నరసింహం, ఆర్థిక కార్యదర్శిగా పీ.సుమన్, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా ఏ.రాజు, కే.రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బీ.మాల్యాద్రి, ఉపాధ్యక్షుడుగా జీ.రవి ఎంపికయ్యారు. వీరితో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులను, మహిళా సభ్యులను, సభ్యులను ఎంపిక చేశారు. ఈ ఎన్నికలను రాష్ట్ర నాయకులు వీ.ప్రభాకర్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, సభ్యులు మాలకొండయ్య పర్యవేక్షించారు.

మోటార్ బైక్, ఆటో బోల్తా

● ముగ్గురికి గాయాలు

సీతారామపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెదనాగంపల్లి గ్రామం జాతీయ రహదారిపై ఆదివారం ఓ మోటార్‌బైక్ రోడ్డుపై అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న సీతారామపురానికి చెందిన కల్యాణ్, బాలాజీలకు గాయాలయ్యాయి. అలాగే ఎదురుగా వస్తున్న ఆటో రోడ్డుపై పడిఉన్న బైక్‌ను తప్పించబోయి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న మనోజ్‌కు గాయాలయ్యాయి. బాధితులను సీతారామపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

వీపీఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

నెల్లూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) :పేదలు, దివ్యాంగులకు అండగా నిలుస్తున్న వీపీఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం రూరల్లోని కనుపర్తిపాడు వద్దనున్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో 90 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో వారు రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 1050 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందచేశామన్నారు. పేదలకు కంటి చూపు మెరుగుపడేందుకు ఉదయగిరి నియోజకవర్గంలో 2,845 మందికి పరీక్షలు, ఉచితంగా కంటి అద్దాలు అందచేశామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాలలో వీపీఆర్ దంపతుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, నుడా చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీలో కార్యక్రమంలో మంత్రి నారాయణ, వీపీఆర్ దంపతులు

వైవీ చెబితేనే అప్పన్నకు ఆర్థిక సాయం చేశా : ఎంపీ

శ్రీకాకుళంకు చెందిన అప్పన్నకు మానవతా దృక్పథంతో రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశా నని, దానిని మాజీ సీఎం జగన్ తప్పుపడుతూ విమర్శలు చేయడం సరికాదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హితవుపలికారు. నాడు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న అప్పన్నకు ఆర్థిక సహాయం నేను చేయలేను, నువ్వు చెయ్యని వైవీ సుబ్బా రెడ్డి చెబితేనే చేశానని గుర్తు చేశారు. ఇలాంటి సాయం ఎందరికో చేశానని తెలిపారు. పేదల కు సహాయం చేసి జగన్ లాంటి వ్యక్తుల ద్వారా నిందలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మనం చేసిన మంచి, చెడులు దేవుడికి తెలుసన్నారు.

ఆధునిక నేత్ర వైద్యంపై అవగాహన అవసరం

● సీఎంఈ సదస్సులో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి


కంటి వైద్య సదస్సు ప్రారంభ సమయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య నిపుణులు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేత్ర వ్యాధులకు వస్తున్న ఆధునిక వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవాలని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి వెల్లడించారు. ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆదివారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కంటి విభాగం అధిపతి డాక్టర్ వసంత నేతృత్వంలో కంటి వ్యాధులు- ఆధునిక వైద్య విధానాలపై సీఎంఈ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు విజయవాడ, గుంటూరు నుంచి వివిధ కంటి ఆసుపత్రుల నుంచి వచ్చిన వైద్యనిపుణులు డాక్టర్ సుజాత, డాక్టర్ కపూర్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ హారిక, డాక్టర్ రేతిక, డాక్టర్ సుజన, డాక్టర్ శార్వాని లు మాట్లాడారు. కంటి కింద ఉన్న సంచులను తగ్గించటం, వంగిఉన్న కనురెప్పల నుంచి అదనపు చర్మాన్ని తొలగించటం(బ్లెఫరోప్లాస్టి) కంటి సౌందర్యం కోసం ఓక్యులోప్లాస్టీని విస్తృతంగా చేస్తున్నారన్నారు. కంటి కణితులను ఆధునిక వైద్య విధానాల ద్వారా చికిత్స చేయవచ్చన్నారు. ఈ సదస్సు పరిశీలకులుగా ఎన్టీఆర్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ సంపత్‌కుమార్ వ్యవహరించారు. ముందుగా వైద్య నిపుణులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మణికుమార్, కంటి వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కారు, మోటారు బైక్ ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరుణవాయి క్రాస్‌రోడ్డు సమీపంలో ముంబాయి రహదారిపై ఎదురెదురుగా వస్తున్న కారు, మోటారుబైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెం నుంచి షామీర్ అనే వ్యక్తి బైక్‌పై సంగం వస్తుండగా మైదుకూరు నుంచి వస్తున్న కారు తరుణవాయి క్రాస్‌రోడ్డు వద్ద ఒకదానికొకటి ఢీకొనడంతో షామీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తున్న పోలీసులు

రౌడీషీటర్ జాకీర్‌బాషాపై పీడీ యాక్ట్

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : వేదాయపాళెం ఎంఆర్ నగర్, గాంధీ నగర్ ప్రాంతంలో నివాసం ఉండే రౌడీషీటర్ జాకీర్‌బాషాపై జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల సూచనలతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వుల మేరకు పీడీయాక్ట్‌తో కడప జిల్లా జైలుకు పంపించినట్లు వేదాయపాళెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాసరావు తెలిపారు. జాకీర్‌బాషా చిన్నబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో జరిగిన హత్యానేరంతోపాటు ఏడు నేరాల్లో నిందితుడుగా ఉన్నాడని, అతనిపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉందన్నారు. ఇప్పటికే తమ స్టేషన్ పరిధిలో ఐదుగురుది రౌడీషీటర్‌లపై పీడీయాక్ట్ ప్రయోగించి జైలుకు పంపించామన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెన్నానదిలో మృతదేహం లభ్యం

ఇందుకూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివర్తిపాలెం దగ్గర పెన్నానదిలో ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం పెద్దపవని గ్రామానికి చెందిన గుత్తి మల్లికార్జునరావు (52) మృతదేహం ఆదివారం నదిలో కొట్టుకువచ్చింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుని జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు పెద్దపవని గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ధర్మకాటా దుకాణంలో మద్యం స్వాధీనం

● గత ప్రభుత్వంలోనిదిగా గుర్తింపు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఓ బంగారు ధర్మకాటా దుకాణంలో గత ప్రభుత్వంలోని మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సంతపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య ఆదివారం తెలిపారు. కావలి ముసునూరుకు చెందిన సీహెచ్ మల్లికార్జున నగరంలోని కామాటివీధిలో చైతన్య ధర్మకాటా నిర్వహిస్తున్నారు. ఆయన దుకాణంలో మద్యం సీసాలను అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో ఎస్‌ఐ బాలకృష్ణ, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. దుకాణంలో గత ప్రభుత్వంలోని వివిధ కంపెనీలకు చెందిన 117 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలపై ఎలాంటి లేబుల్ లేకపోవడంతో నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ అధికారుల సహకారంతో వివిధ కోణాల్లో విచారిస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్ తట్టుకుని వృద్ధుడికి తీవ్ర గాయాలు

సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారి కూడలిలో స్పీడ్‌బ్రేకర్లను తట్టుకుని కిందపడి చేజర్ల గ్రామానికి చెందిన సహదేవుడు అనే వృద్ధుడు ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

10 నుంచి 'టెట్'

● జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంపిక చేసిన ఆరు పరీక్ష కేంద్రాల్లో ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు ఏపీ టెట్-2025 కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ బాలా జీరావు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలుంటాయ పేర్కొన్నారు. జిల్లాలో ఏపీ టెట్‌కు దరఖాస్తు చేసుకు న్న వారు పరీక్షకు రెండు గంటల ముందుగా కేంద్రా నికి చేరుకోవాలని తెలిపారు. అలాగే పిల్లల మార్కు లు యాప్‌లో నేరుగా చూసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పర్యవేక్షణాధికారి పాఠశాలను సందర్శించినపుడు పీఎంఆర్‌లో నమోదు చేసిన రోజువారీ మార్కులను చూపించాలని పేర్కొన్నారు. సెలవుల్లో సైతం యాక్షన్‌ప్లాన్ అమలు చేయాల్సిందేనని, వందశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.

టెన్త్ విద్యార్థులపై దృష్టి సారించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను తప్పక అమలు చేయాలని తెలిపారు. యాక్షన్‌ప్లాన్ ప్రకారం టైం టేబుల్‌ను అనుసరించి సబ్జెక్ట్ ఉపాధ్యాయులు తరగతులు, పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రణాళికలో సూచించిన విధంగా నిర్దేశించిన సబ్జెక్టులలో స్లిప్‌టెస్టులు నిర్వహించాలని పేర్కొన్నారు. పరీక్ష అనంతరం మూల్యాంకనం చేసి మార్కులను పీఎంఆర్‌లో, లీప్‌యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.

గంజాయి కేసులో పాన్ శేఖర్ అరెస్ట్

● 2.04 కిలోల గంజాయి స్వాధీనం

కావలి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడంగుంట రైల్వే గేట్ సమీపంలో బీకే నగర్ ఒరిస్సా కాలనీకి చెందిన పాన్ శేఖర్‌ను ఆదివారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి ఆయన వద్ద నుంచి 2.04 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. రూరల్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం విలేకర్లకు ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాలతోపాటు కావలి డీఎస్పీ శ్రీధర్ సూచనల మేరకు స్పెషల్ బ్రాంచ్ నిఘావిభాగం సమాచారంతో కావలి రూరల్ మండలంలో గంజాయి విక్రయాలపై నిఘా ఉంచామన్నారు. బుడంగుంట రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో తాను ఎస్‌ఐలు బాజీబాబు, తిరుమలరెడ్డి, సిబ్బందితో పాటు స్పెషల్ బ్రాంచ్ నిఘా విభాగంతో కలిసి గంజాయి విక్రేత పాన్ శేఖర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఆయన వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒరిస్సాకు చెందిన పాన్ శేఖర్ కావలి బాలక్రిష్ణారెడ్డి నగర్‌లోని ఒరిస్సా కాలనీకి చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నారన్నారు. ఆయన ఒరిస్సా రాష్ట్రం బస్తర్ జిల్లాలోని అమర్‌కోట్ గ్రామంలో గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి కావలిలో ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. గంజాయిని పట్టుకున్న వారిలో ఎస్‌ఐలు బాజీబాబు, తిరుమలరెడ్డి, సిబ్బంది బీ. శ్రీనివాసులు, కే. ప్రసాద్, షేక్ ఇర్షాద్ ఉన్నారని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100): 670

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.12288
వెండి కిలో ధర	రూ. 183600
వెండి ఒక గ్రాము	రూ.188.60

బ్రాహ్మణ మహా సంఘం మందుల వితరణ

కావలి (టౌన్) డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావు నగర్‌కు చెందిన పేద బ్రాహ్మణుడు బీ సుధాకర్ కుమారుడికి ఇటీవల గుండె శస్త్ర చికిత్స జరిగింది. దీంతో బ్రాహ్మణ మహా సంఘం రూ. 14 వేల విలువ చేసే మందులను ఆదివారం వితరణ చేసింది. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, ప్రాంతీయ కార్యదర్శులు ఏవీ చలపతిరావు, స్వయంకుల రవికుమార్ శర్మ సుధాకర్ నివాసానికి వెళ్ళి పరామర్శించారు. పేద బ్రాహ్మణులను ఆదుకోవడంలో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

బీసీ కులగణన చేయాలి

కందుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకై ఆత్మాహుతి చేసుకున్న ఈశ్వరాచారి మృతికి సంతాపంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన కార్యక్రమంలో సురేష్‌బాబు మాట్లాడుతూ బీసీలంతా సంఘటితంగా పోరాటానికి సిద్ధం కావాలన్నారు. నిరసన కార్యక్రమంలో యర్రంశెట్టి ఆనంద్‌మోహన్, నత్తా రామారావు, కంకణాల చినబ్రహ్మయ్య, వీరేపల్లి రత్నాచారి, ఎం హరిబాబు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, చనమాల రామారావు, చిరంజీవి పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ, విశ్వబ్రాహ్మణసంఘం నాయకులు

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి అనివేటి మండపం నిర్మాణానికి పట్టణానికి చెందిన మోదడుగు వెంకట నరసింహారావు, అనూరాధ దంపతులు వారి కుమారుడు వెంకటసాయిస్వరూప్, వెంకటలక్ష్మి అనూష దంపతులు ఆదివారం రూ. 25116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు పిడికిటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో కందుకూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామా కొండపనాయుడు, ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా ముప్పూరి మాల్యాద్రి, సహాధ్యక్షుడుగా టి సరోజనమ్మ, చదలవాడ కోటేశ్వరరావు, కోశాధికారిగా ఎం వేణుగోపాలరెడ్డి, మరో ఎనిమిది మందిని జిల్లా కౌన్సిలర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అధ్వానంగా వెంగయ్యగారిపాలెం రోడ్డు

కావలి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వెంగయ్యగారిపాలెం రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయమైందని వాహనచోదకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం నుండి పాతూరు మీదుగా వెంగయ్యగారిపాలెం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికి అక్కడ నుండి జాతీయ రహదారి వరకు ఉన్న కిలో మీటర్ మేర రోడ్డు గుంతలు పడ్డాయి. దీంతో అల్లిగుంటపాలెం, కోనేటిపాలెం, మాతినవారిపాలెం, పెదదిన్నెపాలెం, మోర్లవారిపాలెం, సర్వాయపాలెం గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వెంగయ్యగారిపాలెం నుండి జాతీయ రహదారి వరకు రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలు పెంపొందించాలని కందకుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం కందుకూరులో జరిగిన యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉపాధ్యాయులకు అన్నింటా అవమానాలు, అగౌరవమే మిగిలాయన్నారు. దాచుకున్న సొమ్మును కూడా తీసుకోలేని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా వ్యవస్థకు మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు బోధనా ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలు క్యూ కడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, సీనియర్ కార్యకర్త ముప్పరాజు కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు, కందుకూరు యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామా కొండప నాయుడు, చిత్తూరు వెంకటేశ్వర్లు, గుడ్లూరు, వివిపాలెం, లింగసముద్రం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు

పందుల సంచారం .. వ్యాధుల భయం!

● ఆందోళనలో అంజయ్యనాయుడు కాలనీవాసులు

అల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు పట్టణ పరిధిలోని అంజయ్యనాయుడు కాలనీలో పందుల సంచారంతో స్థానికులు విసిగిపోతున్నారు. గత టీడీపీ హయాంలో కాలనీలో ఇళ్లస్థలాలు మంజూరు చేయడంతో అక్కడ ప్రజలు గృహాలు నిర్మించుకొని నివాసముంటున్నారు. అయితే డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో మురుగునీరు నివాసాల మధ్యనే నిల్వ ఉంటోంది. దీంతో నిత్యం ఇళ్ల ముందు పందుల సంచారం అధికమైందని, పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. పందుల బెడదను నివారించాలని స్థానిక నగర పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పందుల సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు వాపోతున్నారు.



అభిమానులకు అండగా ఉంటాం!

● ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు

దగదర్తి (బిట్రగుంట) డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాలేపాటి కుటుంబాన్ని అభిమానించేవారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు తెలిపారు. దగదర్తి మండలం పెద్దపుత్తేడు పంచాయతీ మాజీ ఎంపీటీసీ తిరుపతమ్మ భర్త, టీడీపీ నేత బత్తల రవి అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో, ఆదివారం ఆయనను రవీంద్రనాయుడు పరామర్శించారు. బత్తలరవి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులకు ఆయన భరోసా అన్నారు.


బత్తల రవిని పరామర్శిస్తున్న రవీంద్రనాయుడు

మల్లికార్జున కుటుంబానికి చేయూతనిస్తాం!

● టీడీపీ కన్వీనర్ బిజ్జం క్రిష్ణారెడ్డి

కలిగిరి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పంచాయతీ జిర్రావారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గోసాల మల్లికార్జున గత నెల 27న గ్రామంలోని చర్చి వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరు వైద్యశాలలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మల్లికార్జున మృతదేహాన్ని స్వగ్రామమైన జిర్రావారిపాలెంకు ఆదివారం తీసుకువచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిర్రా అంకిరెడ్డి, కొప్పోలు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న క్రిష్ణారెడ్డి తదితరులు

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యులు, గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాలలు సమర్పించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు 12మంది ఎంపిక

ఉలవపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి జూడో పోటీల ఎంపిక ఆదివారం మండలంలోని కరేడు గ్రామంలో జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. 25 మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీలలో 12 మందిని ఎంపిక చేసినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరి మురళి తెలిపారు. వీరంతా కర్నూల్‌లో జరగబోవు రాష్ట్రస్థాయి జూడో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కావలి నుంచి పవిత్ర, కావ్యలు ఎంపిక కాగా, కొత్తసత్రం నుంచి ఏ సాయిఅక్షిత, బాలాజి, శ్రీను, అదే విధంగా వలేటివారిపాలెంకు చెందిన హైమా, లింగసముద్రం నుంచి లోకేష్, కరేడు గ్రామం నుంచి సాగర్, కలిగిరి నుంచి సందీప్, జీ హర్షిణి, కందుకూరు నుంచి పీ జీవిత, రంగాపురం నుంచి ఎం అల్లూరయ్య, శివ ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు.


ఎంపిక పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కందుకూరు విద్యార్థి

కందుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కందుకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్కే తాజుద్దీన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా 69వ అండర్ 17 హాకీ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టులో స్థానం సంపాదించాడు. కడప జిల్లా పులివెందులలో ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ టోర్నమెంటులో పాల్గొననున్న సందర్భంగా ఆదివారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యం నరసింహమూర్తి, ఎం రమణయ్య, స్టాఫ్ సెక్రటరీ చిత్తూరు వెంకటేశ్వర్లు తదితరులు తాజుద్దీన్‌ను, అతనికి శిక్షణ ఇచ్చిన పీడీలు ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, మెండా నరసింహంను అభినందించారు.


క్రీడాకారుడు తాజుద్దీన్‌తో టీచర్లు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బిట్రగుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో సంఘకాపరి రెవ పాస్టర్ జీ శ్యామ్యూల్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టుకకు చిహ్నంగా నక్షత్రాన్ని ఆలయ శిఖరంపై ఆరోహణ ప్రార్థనలతో ప్రారంభించారు. సీనియర్ సిటిజన్ కే. చిట్టెమ్మచే కేక్‌కట్ చేయించి సంఘస్తులకు పంచిపెట్టారు. అనంతరం రెవ పాస్టర్ పాడేటి శ్యాంసన్ నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఇనమడుగుకు చెందిన రెవ పాస్టర్ జే సుందర్‌రాజ్ క్రీస్తు పుట్టుక గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘకార్యదర్శి బీ. ఫిలిప్, సంఘస్తులు పాల్గొన్నారు.



రక్షణ గోడలు లేని వంతెన

● పొంచి ఉన్న ప్రమాదం


రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీపీఆర్ (కావలి) కాలువ వంతెన రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. సంగం పంచాయతీకి అనుబంధ గ్రామమైన వెంకటేశ్వరపురం గ్రామానికి రాకపోకలు సాగించడంతోపాటు రైతులు, పశువులు పొలానికి వెళ్లేందుకు వంతెన నిర్మించారు. ఏక వరుసలో ఉన్న వంతెన రెయిలింగ్ శిథిలమై పూర్తిగా దెబ్బతింది. కాలువలో పది అడుగుల మేర నీటి ప్రవాహం ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు ఈవంతెనపై బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అదుపు తప్పితే గల్లంతే. అధికారులు, పాలకులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

బస్సు వేళల్లో మార్పు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ బస్సు సర్వీసు వేళల్లో ఆదివారం నుంచి మార్పు చేయడం జరిగింది. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పాఠశాల సమయానికి అనుకూలంగా బస్సు సర్వీసును కొనసాగించాలని కోరుతూ శనివారం ఉపాధ్యయులు, గ్రామస్థులు ఉదయగిరి డిపో మేనేజరు రమేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఆయన సమయంలో మార్పు చేసి సర్వీసును కొనసాగించ డంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

అనంతసాగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విదార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంధపాలకుడు నారాయణరావు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతోందని, సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని, ఆ దిశగా తల్లిదండ్రులు విద్యార్థులను పోత్సహించాలని కోరారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగవరపమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


నాగవరపమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

విద్యారంగ సమస్యలపై సమష్టిగా పోరాడాలి : యూటీఎఫ్


ఉదయగిరి: మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి



వరికుంటపాడు: ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ బాధ్యులు

ఉదయగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పట్ల, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై సమష్టిగా పోరాడాల్సిన అవసరముందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కంభాల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 12వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం మం డల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అరవ సురేష్, షేక్ మహ్మద్‌హనీఫ్, గౌరవాధ్యక్షుడిగా షేక్ మున్నా, ట్రెజరర్‌గా ఉదయ్‌కుమార్‌లను ఎంపిక చేశారు. ఈసందర్భంగా నూతన కమిటీని యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించి అభినందనలు తెలిపారు. మహాసభలకు హాజరైన ఉపాధ్యాయులకు బ్యాగులు వితరణ చేసిన పుల్లాయపల్లి గ్రామానికి చెందిన కంభాల నరసింహారెడ్డికి సంఘ నాయకులు ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎడమ తిరుపతయ్య, దస్తగిరిఅహ్మద్, రంతుజాని, నాగేశ్వరరెడ్డి, కప్పా వెంకటేశ్వర్లు, షేక్ ఖాదర్ బాషా, ఏడుకొండలు, ఫణిరాజ్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** ప్రభు త్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలరాఘవులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల శాఖ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి బాలరాఘవులు ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పీ మనోహర్, వీవీ సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా ఎల్ చలపతి, సీహెచ్ శ్యామల, కోశాధికారిగా డీ చంద్రమౌళి, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్ నాగార్జున, షేక్ కరీముల్లా, జీ హజరత్, ఎల్‌వీ నారాయణ, కేవీ కాంతారావు, ఎస్ నిర్మల, మహిళా కన్వీనర్, కో కన్వీనర్లుగా ఆర్ భవానీ, కే భువనేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన బాధ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఉపాధ్యాయులకు బ్యాగు లు, భోజన వసతి కల్పించిన పెద్దిరెడ్డిపల్లి ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె రవీంద్రతో పాటు ఉపాధ్యాయులు ఎల్‌వీ నారాయణ, లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ నారా యణ, వీవీ సుబ్రమణ్యం, జిల్లా ప్రతినిధి ఆర్ నాగార్జున, జిల్లా కుటుంబ సంక్షేమశాఖ డెరెక్టర్ కరీముల్లా, ఎం సుబ్బారావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

● **మర్రిపాడు :** స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఉపాధ్యాయ సంఘం నాయకులు యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్, అధ్యక్షుడిగా విజయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కె సుధాకర్, కోశాధికారిగా అబ్దుల్ మునాఫ్, ఎఫ్‌డబ్ల్యూ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు జిల్లా కార్యదర్శి మోహన్ ప్రసాద్, నాయబ్ అధ్యక్షత వహించారు. అనంతరం మండల యూటీఎఫ్ నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మానవ సమస్యలకు పరిష్కారం చూపేదే భగవద్గీత


ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరి సమస్యలకు పరిష్కార మార్గం చూపేదే భగవద్గీత అని గుంటూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శరత్ అన్నారు. స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆత్మజ్ఞానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 9వ తేదీ నుంచి పిరమిడ్ నగర్‌లో పంచ మహాయజ్ఞం జరుగుతుందని అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేమలత, రాజేశ్వరి, ఉమా, నాగలక్ష్మీ, సుజాత, ఆదిలక్ష్మీ, లక్ష్మీ, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

నల్లపురెడ్డిపల్లి రోడ్డుకు మహర్దశ

● రోడ్డు నిర్మాణానికి రూ. 5 కోట్ల మంజూరు

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపరెడ్డిపల్లి రహదారికి మహర్దశ పట్టనుంది. దశాబ్ద కాలంగా అడుగడుగునా గోతులు, ఎక్కడకక్కడ కోతకు గురైన తారురోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ళ, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే వెళ్లలేకపోతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే వాహనదారులకు గుంతలు ఎక్కడున్నాయో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈక్రమంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు-బట్టేపాడు రోడ్డు నుంచి నల్లపురెడ్డిపల్లి, మురగళ్ల మీదుగా కనుపూరుపల్లి వరకు ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేయించారు. టెండరు ప్రక్రియ అనంతరం రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి.


గుంతలమయంగా ఉన్న నల్లపరెడ్డిపల్లి రోడ్డు

చెంచురామయ్య విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు వరప్రసాదినిగా మారిన గండిపాళెం జలాశయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన అప్పటి శాసనసభ్యుడు పొన్నెబోయిన చెంచురామయ్య విగ్రహాన్ని జలాశయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సన్నాహాలు చేస్తున్నారు. ఆయన కుమారుడు మాజీ జడ్పీ చైర్మన్ చంచలబాబుయాదవ్ అభ్యర్థన మేరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జలాశయానికి అధికారికంగా పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయంగా నామకరణం చేసి జాతికి అంకితం చేసింది. అదే తరహాలో ప్రస్తుతం విగ్రహాన్ని సైతం త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు కాకర్ల ముందుకు రావడం అభినందనీయమని చంచలబాబుయాదవ్‌తో పాటు ఆయా మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా కమ్మవారిపాళెం రహదారి

● వాహనదారుల అవస్థలు


కమ్మవారిపాళెం వద్ద మోకాటిలోతు గుంతలతో ఉన్న రహదారి

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీలోని కమ్మవారిపాళెం-లక్ష్మీపురం గ్రామాల రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల రహదారికి మరమ్మతులు చేపట్టారన్నారు. అయితే పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి మొత్తం మోకాటిలోతు గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని, లేదంటే ఆందోళన చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

సోమశిల రహదారిపై గుంతలు పూడ్చాలి

అనంతసాగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల రహదారిపై గుంతలు పూడ్చాలని పీకేపాడు రీచ్ నిర్వాహకులను స్థానిక టీడీపీ నాయకులు కోరారు. రీచ్ వద్దకు వెళ్లి వారితో ఆదివారం చర్చించారు. గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సోమశిల మాజీ సర్పంచు ఉప్పల విజయ్‌కుమార్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప మాలధారులు

ఉదయగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతానికి చెందిన పలువురు అయ్యప్ప మాలధారులు ఆదివారం శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక పార్వతీ పరమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి గురుస్వాములచే ఇరుముడి కట్టించుకున్నారు. అనంతరం ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ సర్కిల్‌కు చేరుకుని ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు తరలివెళ్లారు.

చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు

ఉదయగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్ భాయ్‌వీధి మదరసాలో ఆదివారం యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ముస్లిం చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా మౌలానా సయ్యద్ అఫ్రోజ్, హఫీజ్, షరీఫ్‌లు వ్యవహరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంభం

అనంతసాగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, అనంతసాగరం మండల టీడీపీ పరిశీలకుడు కంభం విజయరామిరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్చ్.. ఇంకా బాలారిష్టాలే

● జిల్లా ఏర్పాటై మూడున్నరేళ్లవుతున్నా సమకూరని సదుపాయాలు



కలెక్టరేట్ సహా 80 శాతం శాఖల కార్యాలయాలు ఏర్పాటైన టీటీడీ భవనం

ఒక గెజిట్ నోటిఫికేషన్‌తో గత వైసీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4 నుంచి తిరుపతి జిల్లాను ప్రకటించేసి చేతులు దులిపేసుకుంది. కలెక్టరేట్ సహా వివిధ శాఖల జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను, భవనాల నిర్మాణానికి నిధులనూ కేటాయించలేదు. జిల్లా ఏర్పాటయ్యాక రెండేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో తిరుపతి జిల్లా ఏర్పడి మూడున్నరేళ్లవుతున్నా జిల్లా పాలన బాలారిష్టాలను దాటలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

టీటీడీ భవనంలో 80 శాతం కార్యాలయాలు

కలెక్టరేట్ సహా 80 శాతం కార్యాలయాలు టీటీడీ భవనంలో తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.శ్రీవారి యాత్రికుల వసతి సముదాయంగా తిరుపతి రూరల్ మండలం దామినేడు సమీపంలో టీటీడీ పద్మావతి నిలయం పేరిట భారీ భవన సముదాయం నిర్మించిన సంగతి తెలిసిందే. కొత్త జిల్లా ఏర్పాటుతో కలెక్టరేట్‌కు ఈ భవనాన్ని తాత్కాలికంగా కేటాయించారు. నెలకు రూ.28 లక్షలు అద్దె కింద ప్రభుత్వం టీటీడీకి చెల్లించాలి. ఇందులోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, ఫారెస్ట్ సెటిల్‌మెంట్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, లీగల్ సెల్, పరిశ్రమలు, అన్ని సంక్షేమ శాఖలు, దేవదాయ, సహకార వంటి శాఖల కార్యాలయాలు వీటిలోనే ఉన్నాయి. ఈ ఏడాది జనవరి తర్వాత టీటీడీ భవనానికి అద్దె చెల్లించేందుకూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు.

కొన్నింటికే సొంత భవనాలు

● తిరుపతి జిల్లా కాక ముందునుంచీ అర్బన్ పోలీసు జిల్లా కేంద్రంగా ఉంది. దీంతో జిల్లా పోలీసు కార్యాలయం, ఎస్పీ నివాస భవనాలు మాత్రమే ఇటీవల నిర్మాణమయ్యాయి. వాటిని ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుతానికి టీటీడీ భవనంలో ఎస్పీ కార్యాలయం నడుస్తోంది.

● డీఆర్‌డీఏ, డ్వామా, అటవీ, ట్రెజరీ శాఖలకు మాత్రమే సొంత భవనాల్లో జిల్లా కార్యాలయాలున్నాయి.

● డివిజన్ స్థాయి కార్యాలయాల్లోనే ఇంజనీరింగ్ శాఖల కార్యాలయాలను సర్దుకున్నారు. రవాణా, వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యాలయాలదీ అదే పరిస్థితి.

కలెక్టరేట్‌కు జరగని స్థల సేకరణ

● కలెక్టరేట్ భవనాలకు ఇంకా స్థల సేకరణ జరగలేదు. తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల్లో కొన్ని స్థలాలు ప్రతిపాదించినా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. దీంతో స్థల కేటాయింపు కూడా జరగలేదు.

● ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం కాబట్టి పద్మావతి నిలయాన్ని ప్రభుత్వానికి శాశ్వతంగా కేటాయించేందుకు టీటీడీ ఇదివరకే అంగీకరించింది. రూ.వంద కోట్లు టీటీడీకి చెల్లించి భవనాన్ని కొనే ప్రతిపాదన గత ప్రభుత్వం నుంచే పెండింగులో ఉంది. దీంతో కలెక్టరేట్‌కు శాశ్వత భవనాలు ఎప్పుడు సమకూరుతాయో అంచనా వేయలేని పరిస్థితి.

● ముఖ్య అధికారుల నివాస భవనాల విషయానికొస్తే.. మునుపటి కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవనాన్ని కలెక్టర్ బంగ్లాగానూ, ఆర్డీవో బంగ్లాను జేసీ బంగ్లాగా వినియోగిస్తున్నారు. డీఆర్వో, ఆర్డీవోలకు నివాస బంగ్లాలు లేవు.



శ్రీకాళహస్తిలో ఆర్డీవో కార్యాలయం నడుస్తున్న మార్కెట్ కమిటీ భవనం



ప్రైవేటు భవనంలో శ్రీకాళహస్తి డీఎస్పీ కార్యాలయం



సొసైటీ భవనంలో సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం

కొత్త డివిజన్ కేంద్రాలదీ అదే తీరు

● జిల్లా పరిధిలో పాతవైన తిరుపతి, గూడూరు డివిజన్లకు సొంత భవనాలున్నాయి. కొత్తగా ఏర్పాటైన శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలకు సొంత భవనాలు లేవు.

● శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనంలో నడుస్తోంది. భవన నిర్మాణానికి స్థల సేకరణ కూడా జరగలేదు. ఆర్డీవో నివాసమూ అద్దె భవనంలోనే. కొత్తగా ఏర్పాటైన డీడీవో కార్యాలయమూ డీఆర్‌డీఏ భవనంలో తాత్కాలికంగా ప్రారంభమైంది. డీఎస్పీ కార్యాలయం సహా మిగతా శాఖల డివిజన్ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే ఉన్నాయి.

● సింగిల్ విండో కార్యాలయ భవనంలో సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. స్థల సేకరణా జరగలేదు. ఆర్డీవో నివాసమూ అద్దె భవనంలోనే. డీఎస్పీ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, కార్మిక శాఖల డివిజన్ కార్యాలయాలు నాయుడుపేటలో ఉన్నాయి. వీటిని సూళ్లూరుపేటకు తరలించే ప్రతిపాదనేదీ రాలేదు. మిగిలిన శాఖల డివిజన్ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

జిల్లాల నడుమ జరగని శాఖలు, సంస్థల విభజన

ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచీ కొన్ని నియోజకవర్గాలను వేరుచేసి తిరుపతి జిల్లా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడున్నరేళ్లవుతున్నా ఇప్పటికీ కొన్ని శాఖలు, సంస్థలను విభజించలేదు.

● జిల్లాలోని 20 మండలాలు చిత్తూరు జడ్పీ పరిధి.. 14 మండలాలు నెల్లూరు జడ్పీ పరిధిలో ఉన్నాయి. తిరుపతి అర్బన్ పోను.. మిగిలిన 19 మండలాల ఎంపీడీవోల బదిలీలు, పదోన్నతులు చిత్తూరు, 14కు సంబంధించి నెల్లూరు జడ్పీ సీఈవో కార్యాలయం నియంత్రిస్తోంది.

● రెవెన్యూ శాఖకు సంబంధించి తహసీల్దార్ల బదిలీలు, పదోన్నతులు ఇటు చిత్తూరు కలెక్టర్, అటు నెల్లూరు కలెక్టర్ల పరిధిలోనే ఉన్నాయి. తిరుపతి కలెక్టర్ ప్రతిపాదనల మేరకు వారే ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ● ఎంఈవోల నియామకం, బదిలీలు, ఉపాధ్యాయ బదిలీలు, పోస్టుల భర్తీ వంటివన్నీ చిత్తూరు, నెల్లూరు డీఈవోల నియంత్రణే సాగుతోంది.

● జిల్లా సహకార కేంద్రబ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ వంటివీ చిత్తూరు, నెల్లూరు కేంద్రాలుగానే పాలన సాగిస్తున్నాయి.

● తిరుపతిలో జరిగే జిల్లా స్థాయి సమీక్షా సమావేశాలకు చిత్తూరు, నెల్లూరు జిల్లాల అధికారులు హాజరు కావాల్సి వస్తోంది. అధికారిక, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ప్రొటోకాల్ కూడా రెండు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల పాటించాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్పష్టమైన విభజన జరిగి జిల్లాలో పూర్తిస్థాయి పాలన ప్రారంభమైతే తప్ప కొత్త జిల్లా ఏర్పాటు ఉద్దేశం ఆచరణలో నెరవేరే అవకాశం లేదు.

నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సదరన్ డిస్కం సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం10నుంచి 12గంటల వరకు వినియోగదారులు 89777 16661 నెంబరుకు ఫోనుచేసి సమస్యలు చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 91333 31912 నెంబరుకూ చాట్‌చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లచ్చన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

● 14 కేంద్రాల్లో 2,860 మంది విద్యార్థుల హాజరు

తిరుపతి(విద్య),డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షను ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. తిరుపతి, తిరుచానూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, పుత్తూరు ప్రాంతాల్లోని 14 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు 2,958 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 2,860 మంది హాజరయ్యారు. 95 మంది గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో వసతులు, భద్రతా చర్యలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు.

అపరాధం లేకుండా 9 వరకు టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు

తిరుపతి(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను సవరించినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. 'ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 9వ తేదీలోపు ఫీజులు చెల్లించవచ్చు. ఆ తర్వాత రూ. 50 అపరాధ రుసుంతో 12 వరకు, రూ. 200 అపరాధంతో 15 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 18వ తేదీ వరకు ఫీజు చెల్లించొచ్చు. ఆ తర్వాత గడువు పొడిగించే పరిస్థితి ఉండదు. ఒకేషనల్ విద్యార్థులు వృత్తి ఫీజును కూడా దీతో పాటే చెల్లించాలి. ప్రత్యేక ప్రతిభావంత.. కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధికంగా ఫీజులు వసూలుచేసే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. యూడైస్ నమోదులో పొరపాట్లు జరగకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రతగా ఉండాలి. యూడైస్‌లో వివరాల నమోదు, ధ్రువీకరణ తర్వాత విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్ నుంచి ఫీజులు చెల్లించాలి' అని ప్రధానోపాధ్యాయులకు డీఈవో సూచించారు.

● సంస్కృత వర్సిటీలో

కీచకపర్వంపై కేసు

● ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఫోన్లు

● బాధితురాలి వాఙ్మూలం నమోదుకు పోలీసుల నిర్ణయం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో కీచకపర్వంపై కేసు నమోదైంది. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా శనివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెస్ట్ సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వెంటనే ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణకుమార్, శేఖర్‌రెడ్డి సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. వారి సంభాషణ రికార్డులను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. సాంకేతిక ఆధారాల సేకరణ కోసం వారిద్దరి సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు సీఐ చెప్పారు. కాగా, అసిస్టెంట్ లక్ష్మణ్‌కుమార్‌పై బాధితురాలు వారం కిందట వీసీ కృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించాక ఆయన్ను సస్పెండ్ చేస్తూ వీసీ ఆదేశాలు జారీ చేశారు. ఇదే ఘటనపై వీడియో తీసి ఆమెను లైంగికంగా వేధించిన మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్ రెడ్డి ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలు నుంచి ఫిర్యాదు లేకపోవడంతో విచారణకు ఇబ్బందులు రావచ్చనే ఆలోచనతో ఉన్నారు. అందుకని ఆమెను విచారించడానికి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో పోలీసులు త్వరలో ఒడిశా వెళ్లనున్నట్లు తెలిసింది. లేదా ఆమెను తిరుపతికి రప్పించి వాఙ్మూలం తీసుకోవడమా అనే దిశగానూ ఆలోచిస్తున్నట్లు సమాచారం. నిందితులపై చర్యలు తీసుకోవాలంటే బాధితురాలి వాఙ్మూలం అవసరమని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ఎస్సీ, మహిళ, హక్కుల కమిషన్‌కు ఎంపీ ఫిర్యాదు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్ ఘటనపై ఎంపీ గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, జాతీయ ఎస్సీ.. మహిళా.. మానవ హక్కుల కమిషన్లకు లేఖలు రాశారు. వీరి వేధింపుల కారణంగా విద్యార్థిని చదువు ఆపేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమన్నారు. ఈ ఘటన తీవ్రతను, బాధితురాలి భద్రతను, ఆమె ఎదుర్కొన్న మానసిక వేదనను దృష్టిలో ఉంచుకొని ఈ కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరారు. బాధితురాలిపై ఒత్తిడి లేకుండా ఉండేందుకు తగిన రక్షణ కల్పించి, ఆమె చదువుకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల్లో ఇలాంటి వేధింపులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమగ్ర విచారణ చేపడుతున్నాం

ఓ విద్యార్థిని పట్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ కీచక పర్వంపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా ఆదివారం స్పందించారు. 'ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేశాం. ఈ ఘటనపై కమిటీ చేత విచారణ చేపడుతున్నాం. పోలీసులకూ ఫిర్యాదు చేశాం. విద్యార్థుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం' అని ఒక ప్రకటనలో తెలిపారు.

ఏకలవ్య గురుకులంలో

ఉపాధ్యాయుల దాష్టీకం

● అల్లరి చేస్తున్నారని విద్యార్థులను చితకబాదిన వైనం

● తల్లిదండ్రుల ఆందోళన, పోలీసుల విచారణ

● వైస్ ప్రిన్సిపాల్, మరో టీచర్ సస్పెన్షన్





విద్యార్థికి తగిలిన దెబ్బలు - విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీకాంత్

ఓజిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఓజిలి మండలం వాకాటివారికండ్రిగ వద్ద ఉన్న ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో 20 విద్యార్థులను ఇద్దరు ఉపాధ్యాయులు విచక్షణారహితంగా చితకబాదిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు.. శనివారం సాయంత్రం స్టడీ అవర్‌లో చదువుకోకుండా అల్లరి చేస్తున్నారంటూ వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ 20మంది ఏడో తరగతి విద్యార్థులను చితకబాదారు. మంచినీటి పైప్‌తో కొట్టడంతో పలుచోట్ల విద్యార్థుల చర్మం కమిలిపోయింది. ఆదివారం పాఠశాలకు వెళ్లిన తల్లిదండ్రులు పిల్లల చర్మం కమిలిపోయి, వాతలు కనిపించడంతో ఆరా తీశారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తీవ్రంగా కొట్టారని, అతనికి హిందీ టీచర్ హరికృష్ణ సహకరించారని పిల్లలు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఎవరినీ పాఠశాల లోపలకు వెళ్లనీయకుండా ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థుల తలిదండ్రులు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ గురుకుల పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పూర్తి వివరాలను పోలీసు ఉన్నతాధికారులకు, విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, హిందీ టీచర్ హరికృష్ణను ఉన్నతాధికారులు ఆదివారం సస్పెండ్ చేశారు.

● ఫిర్యాదుల సమాచారం కోసం

1100కు కాల్ చేయండి

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తామిచ్చిన అర్జీల్లో పేర్కొన్న సమస్యలు పరిష్కారం కాకపోయినా.. తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలన్నా 'మీకోసం కాల్ సెంటర్ 1100'కు ఫోను చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మీకోసం.ఏపీ.జీవోవి.ఐఎన్'లో అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇక, కలెక్టరేట్‌లో సోమవారం 10 నుంచి 12 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. సమస్య పరిష్కారమైతే ఫోన్లకు మెసేజ్ వస్తుందన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సాప్‌ల ద్వారా పంపిస్తున్నామని తెలిపారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలని సూచించారు.

షేర్ ఆటో ఎక్కుతున్నారా?

● మహిళలూ కాస్త జాగ్రత్త

● తిరుపతి రూరల్‌లో మత్తుమందు చల్లి, కొట్టి గొలుసు లాక్కెళ్లిన డ్రైవరు, ఇద్దరు మహిళలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): షేర్ ఆటో ఎక్కుతున్నారా? అప్పటికే లోపలున్నది మహిళలే కదా అని కాస్త ఏమరపాటుగా ఉంటున్నారా? అయితే కాస్త జాగ్రత్తగా ఉండాలని చెబుతోంది తిరుపతి రూరల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఘటన. ఆ ఘటనకు సంబంధించి తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. పెరుమాళ్లపల్లికి చెందిన మల్లిక వ్యవసాయ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. డ్యూటీ ముగించుకుని షేర్ ఆటోలో ఇంటికి బయలుదేరారు. ఆ ఆటోలో అప్పటికే ఇద్దరు మహిళలు ఉన్నారు. ఆటో వెళ్లే క్రమంలో ఆ ఇద్దరు మహిళలు మల్లికపై మత్తు మందు చల్లారు. ఏం జరిగిందో తెలియని పరిస్థితుల్లో ఉన్న ఆమె తలపై రాడ్డుతో కొట్టారు. రక్తం కారుతుండగానే ఆమె మెడలోని దాదాపు నాలుగు సవర్ల బంగారు బొట్టు చైను లాక్కొన్నారు. ఇలా ఆ ఇద్దరు మహిళలతో ఆటో డ్రైవరు చేతులు కలిపి దారుణానికి ఒడిగట్టారు. ఆ తర్వాత పెరుమాళ్ళపల్లి సమీపంలోని బాలాజీ అకాడమీ స్కూలు వద్ద నడుస్తున్న ఆటో నుంచి మల్లికను కిందకు తోసేశారు. దీన్ని గమనించిన స్థానికులు కొందరు 108 అంబులెన్సు ద్వారా బాధితురాలిని తిరుపతి రుయాకు తరలించారు. తలపై బలమైన గాయాలైనట్లు రుయా వైద్యులు తెలిపారు. జరిగిన ఘటనపై ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి నుంచి వాఙ్మూలం నమోదు చేశారు. నిందితుల ఆచూకీ గుర్తించడానికి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకుంటామని డీఎస్పీ చెప్పారు. ఆటోలు, షేర్ ఆటోలు ఎక్కే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల ఫొటోలు, వాహన నెంబర్లు గమనించి తక్షణం డయల్ 112 కు కాల్ చేయాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.



గాయపడిన మల్లిక



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

నెల్లూరులో కలపాలంటూ రిలే దీక్ష

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని, లేకుంటే జిల్లా కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. ఇదే డిమాండ్‌తో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు మద్దతు ప్రకటించారన్నారు. మొదటిరోజు దీక్షలో జేఏసీ ప్రతినిధులతో పాటు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరే వరకు శాంతియుతంగా ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, భాస్కర్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, శంకర్ రెడ్డి, జమాలుల్లా, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు గుండె కోత

'దిత్వా' తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు కైవల్యా నది ఉధ్రుతంగా ప్రవహించింది. డక్కిలి మండలం శ్రీపురం వద్ద నది ఉప్పొంగి ప్రవహించడంతో పక్కన ఉన్న వరి పంటలు కోతకు గురయ్యాయి. వాటిని చదును చేయాలంటే పెద్దమొత్తంలో ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

- డక్కిలి, ఆంధ్రజ్యోతి



పులికాట్ వాచ్ టవర్‌కు తుప్పు



తుప్పుపట్టి విరిగిపోయిన వాచ్‌టవర్

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సుకు వలస వచ్చే పక్షులను సందర్శకులు వీక్షించే వాచ్‌టవర్ తుప్పు పట్టి మరమ్మతులకు గురైంది. అట్టకానితిప్ప - శ్రీహరికోట మార్గంలో పులికాట్ సరస్సు అంచున పక్షులను వీక్షించేందుకు వన్యప్రాణి అధికారులు ఇనుప రేకులతో వాచ్‌టవర్ ఏర్పాటు చేశారు. సందర్శకులు టవర్‌పైకి వెళ్లేందుకు ఇనుప ఊచలు, రేకులతో దారి, దానికి రెండువైపులా రక్షణగా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఆ ఇనుప ఊచలు, రేకులు తుప్పుపట్టి విరిగిపోయి ఉన్నాయి. రక్షణగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ కూడా ఒక పక్క విరిగిపోయింది. ఇటీవల వర్షాలతో పులికాట్‌కు భారీగా వరదనీరు చేసి నిండుకుండను తలపిస్తోంది. సందర్శకుల తాకిడి కూడా అధికంగా ఉంది. సందర్శకులు వీక్షించే వాచ్ టవర్ మరమ్మతులకు గురైనా వన్యప్రాణి అధికారులు పట్టించుకోలేదు. వాచ్‌టవర్‌కు మరమ్మతులు చేసి సందర్శకులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు



తిప్పగుంటపాళెం గ్రామానికి బోటులో వెళుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

చిల్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం ప్రజలకు ఇబ్బందులు లేకుండా హైలెవల్ వంతెన నిర్మాణం చేపటేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న తిప్పగుంటపాళెం గ్రామానికి ఆదివారం బోటులో వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు రోజులుగా తిప్పగుంటపాళెం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయిందని, వర్షాలు తగ్గినా గ్రామానికి వెళ్లే చప్టా వరదనీరు తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామానికి వంతెన నిర్మాణానికి సంబంధించి గతంలో ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. గ్రామస్తులు ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పట్టాభిరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, లీలావతి, సుప్రజ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీఎస్ పెన్షన్ రూ.9వేలు, డీఏ సాధన, తెల్లరేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ పథకాలను వర్తింపజేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గోపి, గౌరవ సలహాదారుడిగా శేషయ్య, అధ్యక్షుడిగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా రత్నం, ఉదయభాస్కర్, తిరుపాలు, వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా నారాయణరావుతో పాటు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో గంగాధర్, రాజయ్య, శంకరయ్య, చంద్రమౌళి, నరసింహారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడండి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో వెంకటగిరి, శ్రీకాళహస్తి ఏఎంసీ చైర్మన్లు విశ్వనాథం నాయుడు, చెంచయ్య నాయుడు

వెంకటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును వెంకటగిరి, శ్రీకాళహస్తి ఏఎంసీ చైర్మన్లు పునుగోటి విశ్వనాథ నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం విజయవాడలో రాష్ట్రంలోని ఏఎంసీ చైర్మన్ల సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న విశ్వనాథ నాయుడు, చెంచయ్య నాయుడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి బాల వీరాంజనేయస్వామిని కలిశారు. గత వైసీపీ పాలనలో టీడీపీ సానుభూతి పరుల పింఛన్లను కక్షగట్టి తొలగించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అర్హులందరికీ పింఛన్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు

వెంకటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో ఎట్టకేలకు వెంకటగిరి - గూడూరు రోడ్డు మరమ్మతు పనులు మొదలయ్యాయి. ఈ మార్గంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత పెద్దగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా తయారయ్యాయి. ఎమ్మెల్యే చొరవతో ఆదివారంమరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయి.



వెంకటగిరి - గూడూరు రోడ్డులో గుంతలను పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్

నేటినుంచి రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ

సూళ్లూరుపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు టీచ్ టూల్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు ఎంఈవో సునీల తెలిపారు.

నేడు అయ్యప్పస్వామి జ్యోతిపూజ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో అయ్యప్పస్వామి జ్యోతిపూజ సోమవారం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి సేవాసంఘం తెలిపింది. ఉదయం 6 గంటలకు గణపతిహోమం, 8 గంటలకు కలశాల ఊరేగింపు, 10 గంటలకు స్వామివారి పంచవాయిద్యాల పూజ, సాయంత్రం 5 గంటలకు అఖండ కర్పూరజ్యోతి, అనంతరం అయ్యప్ప స్వామికి నగరోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల సొంత నిధులతో కొరిడి - పేర్నాడు రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొరిడి - పేర్నాడు రోడ్డుకు అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారడంతో తారురోడ్డు కలగానే మిగిలిపోయింది. కనీసం మరమ్మతులైనా చేయండని ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుసార్లు విన్నవించుకున్నా ఎవరు పట్టించుకోలేదు.. దిత్వా తుఫాన్ ప్రభావంతో వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు గ్రావెల్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఆర్టీసీ బస్సు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో స్థానిక టీడీపీ నాయకులే రోడ్డు మరమ్మతులు చేసేందుకు ముందుకొచ్చారు. ఆదివారం కొరిడి, కడపత్ర, దామరాయి పంచాయతీ పరిధిలో ఉన్న టీడీపీ నాయకులు మూడు ఎక్స్‌కవేటర్లతో గుంతలమయంగా ఉన్న రోడ్డును చదును చేసి, గోతులు ఎక్కువగా ఉన్న చోట మట్టితోలి మరమ్మతులు చేశారు. రోడ్డును కమ్మేసిన చెట్లను తొలగింపు పనులు చేపట్టారు.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు

మూడు పంచాయతీ పరిధిలో దాదాపు 23 గ్రామాలు ఉన్నాయి. తారురోడ్డు కథ పక్కన పెడితే కనీసం మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గ్రామ ప్రజలు తమను అడుగుతున్నారు. టీడీపీ నాయకులు మాగర్ల తిరుపాల్, గొంజి వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, శేఖర్, అక్కులయ్య కలిసి రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. అట్టకాతిప్ప నుంచి కడపత్ర వరకు 9 కిలో మీటర్లు అధ్వానంగా ఉన్న రోడ్డులో గుంతలను పూడ్చి మరమ్మతులు చేస్తున్నాం.

- శంకరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు



గ్రామోత్సవంలో ఊరేగుతున్న అయ్యప్పస్వామి - దీప జ్యోతులతో మహిళలు

వేడుకగా అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం శనివారం వేడుకగా జరిగింది. ఉదయం గణపతి పూజ, హోమం చేసి అయ్యప్పస్వామికి నెయ్యితో అభిషేకం చేశారు. షార్ బస్టాండు సమీపంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వద్ద అయ్యప్ప ఉత్సవ మూర్తిని వాహనంలో కొలువుదీర్చి పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, సభ్యులు రవీంద్రారెడ్డి, లీలామోహన్‌రెడ్డి కర్పూర జ్యోతిని వెలిగించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. కేరళ బ్యాండ్ మేళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం ఊరేగించారు. మహిళలు దీప జ్యోతులు పట్టుకుని భజన పాటలు పడుతూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

దేశం సుభిక్షంగా ఉండాలని సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న భగత్‌సింగ్

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌కు చెందిన భగత్‌సింగ్ రామేశ్వరం నుంచి కాశీకి సైకిల్ యాత్ర చేపట్టాడు. 17 రోజు క్రితం రామేశ్వరం నుంచి బయలు దేరిన ఈ యువకుడు మార్గమధ్యంలోని వివిధ ఆలయాలను దర్శించుకుంటూ ఆదివారం పెళ్లకూరు మండలానికి చేరుకున్నాడు. చిల్లకూరు వడ్డిపాలెం గ్రామంలోని చండికాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ నుంచి శ్రీశైలం మల్లికార్జునస్వామి, కాశీలో విశ్వనాథస్వామిని దర్శించుకుని యాత్ర ముగిస్తానని చెప్పాడు.

అధికారులపై జగన్ వ్యాఖ్యలు సరికావు



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పట్ల మాజీ సీఎం జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం కొత్తూరులో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ విశ్రాంతం ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిలను వాడు.. వీడు అంటూ చులకనగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాఖమూరి కృష్ణమనాయుడు, మదన్‌మోహన్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, కలవకూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు కలపాటి సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బోల్తా పడిన బస్సు

చిల్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైటర్ సత్రం వద్ద జాతీయ రహదారిపై అయ్యప్ప భక్తులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. గుంటూరు నుంచి అయ్యప్ప భక్తులు బస్సులో శబరిమలైకు బయలుదేరారు. ఆదివారం చిల్లకూరు మండలంలోని రైటర్ సత్రం వద్ద బస్సు అదుపుతప్పి మెల్లగా రోడ్డుపక్కన బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో 35 మంది ఉండగా, 5 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మరో బస్సులో అయ్యప్ప భక్తులు బయలుదేరి వెళ్లారు.

21 వాహనాల సీజ్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద ఆదివారం ఉదయం సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 21 వాహనాలు సీజ్ చేశారు. టిడ్కో ఇళ్ల వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, శివశంకర్, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యానగర్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో ఆదివారం చెందోడుకు చెందిన ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. మేరీపల్స్ రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి సురేష్, సాయిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ ప్రతినిధులు లీలామోహన్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో రక్తదాతలను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

వెంకటగిరి ఎస్‌ఐగా నవనీత

వెంకటగిరి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎస్‌ఐగా నవనీత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ట్రైనీగా ఉన్న ఆమెకు వెంకటగిరిలో రెగ్యులర్ ఎస్‌ఐగా పోస్టింగ్‌గా ఇచ్చారు.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై జగన్ అనుచిత వ్యాఖ్యలు తగవు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీసీ సంఘ నాయకులు అన్నారు. ఆదివారం జగన్ వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం సాయంత్రం బీసీ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి గోపినాథ్ జెట్టి, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్యలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబుకాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు ఉల్లిపాయల చెంచయ్య, పాలచ్చూరు చంద్రమోహన్, పాలచ్చూరు అమరేంద్ర, బట్టా సుబ్రహ్మణ్యంయాదవ్, కోటి మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు రూ.50వేల విరాళం



టీడీపీ నేత రఫీకి విరాళం అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సీఎస్ తేజ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం రూ.50వేలు విరాళం అందజేశారు. ఆదివారం టీడీపీ నాయకుడు రఫీకి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటూరు లక్ష్మయ్య, కోట్లపాటి గాంధీ నాయుడు, ఈతముక్కల వెంకటసుబ్బానాయుడు, మునిరాజ, మునిబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పేద విద్యార్థులను ఆదుకుంటాం

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిభా పాటవాలు కలిగిన నిరుపేద విద్యార్థులను దాతల సహకారంతో ఆదుకుంటామని షిరిడిసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య హామీ ఇచ్చారు. కోటలోని సమితి కార్యాలయంలో ఆదివారం నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన నిరుపేద విద్యార్థిని తాళమాపురం నందినికి దాతల సహకారంతో రూ.50వేల విలువచేసే లాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో దాతలు రత్నం, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు, నవీన్, వెంకటేశ్వర్లు, చంద్రాచారి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినికి లాప్‌టాప్ అందజేస్తున్న రమణయ్య తదితరులు

ఎస్కేప్ చానల్‌కు మరమ్మతులు చేయిస్తా

మత్స్యకారులకు టీడీపీ నేత దశరథరామిరెడ్డి హామీ



గోవిందపల్లి వద్ద దెబ్బతిన్న బకింగ్‌హామ్ కెనాల్ ఎస్కేప్ చానల్‌ను పరిశీలిస్తున్న దశరథరామిరెడ్డి, మత్స్యకారులు

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లి వద్ద ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ ఎస్కేప్ చానల్‌కు తన సొంత నిధులతో తాత్కలిక మరమ్మతులు చేయిస్తానని టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గోవిందపల్లిపాళెంలోని మత్స్యకారులతో కలసి దెబ్బతిన్న ఎస్కేప్ చానల్‌ను పరిశీలించారు. ఇటీవల దిత్వా తుఫాన్ కారణంగా గోవిందపల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్ పొంగి రోడ్డుపై ప్రవహించడంతో రహదారి దెబ్బతింది. దారి లేకపోవడంతో గోవిందపల్లిపాళెం మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండంతో టీడీపీ నేత చిల్లకూరు దశరథరామిరెడ్డి స్పందించారు. ఎస్కేప్ చానల్ తాత్కాలిక మరమ్మతులకు సొంత నిధులు వెచ్చిస్తానని, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి హైలెవల్ వంతెన నిర్మాణానికి చర్యలు చేపడుతానని చెప్పారు.

రోడ్డును కమ్మేసిన కర్రతుమ్మ చెట్లు

వాహనదారులకు ఇబ్బందులు



వడ్డిపాళెం ప్రధాన రహదారి రోడ్డుపైకి పెరిగిపోయిన ముళ్లచెట్లు

వాకాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులను కర్రతుమ్మ చెట్లు కప్పివేస్తున్నాయి. వాకాడు నుంచి దుగరాజపట్నం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కర్రతుమ్మ చెట్లు పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. దారిలో వెళ్లే వాహనదారులకు చెట్ల కొమ్మలు తగులుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో చెట్ల కొమ్మలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి దారికి ఇరువైపులా చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పేదలకు ఆసరాగా ముఖ్యమంత్రి సహాయనిధి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చేయూత అందిస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో చికిత్స పొందిన వారికి 35మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.23.74 లక్షలు అందజేశామన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గపరిధిలో రూ.4 కోట్లకు పైగా అందజేశామన్నారు. అర్హులైన పేదలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలందరూ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గోతులే!



వెంకటగిరి రైల్వేస్టేషన్ మార్గంలో రోడ్డుపై గోతులు

వెంకటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - నాయుడుపేట మార్గంలో రైల్వేస్టేషన్ ప్రాంతంలో రోడ్డు ఇది. దారి మొత్తం గుంతలే ఉండడంతో వాహనదారులకు నరకం కనిపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షానికి నీళ్లు నిలవడంతో గోతులు మరింత పెద్దగా మారాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఎమ్మెల్యే దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.